
తిరుమల తిరుపతి దేవస్థానములు
సప్తగిరి
సచిత్రమాసపత్రిక
మార్చి 2017 వెల రూ.5/-
mohan
PUBLICATIONS
తిరుమల
శ్రీ వేంకటేశ్వరస్వామివారి
తెప్పోత్సవం
2017 మార్చి
08 నుండి12 వరకు
Like us to follow
@mohanpublications

తిరుమల శ్రీవారి ఆలయంలో...

ఉగాది ఆస్థానం

తిరుమలేశుడు తెలుగువారి
ఇలవేలుపు! ఇలువేలుపు కూడా!
ఆ స్వామివారి సన్నిధిలో
తెలుగు ఉగాది వేడుకలు ఘనంగా జరుగుతాయి.
ఉగాది నాటి ఉదయం బంగారు వాకిలి ముందు
సర్వభూపాలవాహనంలో
శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారిని
తూర్పుముఖంగా వేంచేపు చేసి
శోభాయమానంగా అలంకరిస్తారు.
పిదప వారికి ఎడమ పక్కన సేనాధిపతి విష్వక్సేనుడు
దక్షిణాభిముఖంగా వేంచేసి ఉంటాడు.

లడ్డూలు, వడలు, అప్పాలు, దోశలు
మున్నగు పిండి వంటలు, అన్నప్రసాదాలు
విశేషంగా నివేదన చేస్తారు.
ఆ తర్వాత నూతన వస్త్ర సమర్పణ చేసి
ఉగాది ఆస్థానంలో
నూతన పంచాంగ శ్రవణం జరుగుతుంది.
ఆనాటి తిథి వార నక్షత్ర ఫలితాలతో పాటు
నూతన సంవత్సరంలో, ఫలితాలు, ఆదాయ వ్యయాలు,
అతివృష్టి అనావృష్టి, పాడిపంటలు, మున్నగు ఫలితాలను
వినిపించిన తర్వాత ప్రత్యేకంగా సిద్ధాంతి
శ్రీస్వామివారల, అమ్మవారల నక్షత్ర ఫలితాలను విన్పిస్తారు.
నిత్యకల్యాణచక్రవర్తి అయిన శ్రీనివాసుని అనుగ్రహంతో
లోకక్షేమం కలుగుతుందని అర్చకులు శ్రీస్వామివారికి
దివ్యమంగళ కర్పూర హారతులు సమర్పిస్తారు.
బంగారు వాకిలి ముందు ఉన్న ఘంటామండపంలో
జరిగే ఈ ఉగాది ఆస్థానంలో
అర్చకస్వాములూ, శ్రీజియ్యంగారులూ,
అధికారులూ, ఆలయసిబ్బంది మాత్రమే
పాల్గొనే ఉత్సవం ఇది.





దేవునికి దేవికిని....

దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీ కమ్మా ॥

ధర్మార్థకామ మోక్షతతులు నీ సోపానాలు
అర్మిలి నాలుగువేదా లదె నీ దరులు
నిర్మలపు నీ జలము నిండు సప్తసాగరాలు
కూర్మము నీ లోఁతు వో కోనేరమ్మా ॥

తగిన గంగాదితీర్థములు నీకడళ్లు
జగతి దేవతలు నీ జలజంతులు
గగనపుఁబుణ్యలోకాలు నీ దరిమేడలు
మొగి నీచుట్టు మాఁకులు మునుఁలోయమ్మా॥



వైకుంఠ నగరము వాకిలే నీ యాకారము
చేకొను పుణ్యములే నీ జీవభావము
యేకడను శ్రీ వేంకటేశుఁడే నీ వునికి
దీకొని నీ తీర్థమాడితిమి కావవమ్మా ॥

(ఆధ్యాత్మ సంకీర్తన 2-426)

శ్రీదేవికి శ్రీవేంకటేశ్వరునికి తెప్పోత్సవం జరుగుతోంది. అన్నమయ్య ఆ కోనేటి మాహాత్మ్యాన్ని వర్ణిస్తున్నాడు.

ఓ కోనేటితల్లీ! నీవు లోకములను పావనము చేయుదానవమ్మా. దేవదేవుడు నీలో తెప్పోత్సవం జరుపుకుంటున్నాడు. నీ మహిమని ఎంతయని వర్ణించను నీకిదే వందనములు.

చతుర్విధ పురుషార్థములు నీకు సోపానపంక్తులు. నాల్గువేదములు తీరములు, నిర్మలమైన నీ నీరు సప్తసాగరాలు. గంభీరమైన నీ లోతు మందర పర్వతమును తేల్చిన ఆదికూర్మము వంటిది.

నీ అలలు గంగాది పవిత్రమైన నదులవంటివి. నీలోని జల జంతువులు యక్ష కిన్నెర కింపురుషాది దేవతలు. నీ ఒడ్డున ఉన్న మేడలన్నీ ఊర్ధ్వలోకాది పుణ్యలోకములే. నీ చుట్టూ ఉన్న చెట్లన్నీ తపస్సమాధిలో ఉన్న మునీశ్వరులే.

ఓ కోనేటమ్మా! నీ ఆకారము నాకు వైకుంఠాన్ని తలపిస్తోంది. నీయందు తీర్థస్నానముతో పొందే పుణ్యములు నీ జీవభావం. శ్రీవేంకటేశ్వరుడే ఉనికి. నిర్భయంగా నీలో తీర్థస్నానమాచరించే మమ్ము రక్షింపవమ్మా!



మీ మాట..

ధన్యవాదాలు

ఫిబ్రవరి, 2017 సప్తగిరి ఒకవారం ముందుగా పంపినందుకు ధన్యవాదాలు. మాసపత్రిక చాలా బాగున్నది. శ్రీరామానుజులవారి శీర్షిక, కడప రాయుని తిరునాళ్లు గురించి మరియు ఎందరో భక్తులకు భగవానునితో గల సంబంధాలు తెలిపినందుకు ధన్యవాదాలు. ఫోటోలు బాగున్నాయి.

– కస్తూరి రామమోహనరావు, కడప.

రంగుల్లో సప్తగిరి

నేను సంవత్సరంగా 'సప్తగిరి' పుస్తకాన్ని చదువుతున్నాను. ప్రస్తుతం పుస్తకము పూర్తిగా రంగుల్లో వస్తోంది. చాలా ధన్యవాదాలు. ఇదే మాదిరిగా ఇంకా అభివృద్ధిపథంలో ముందుకెళ్లాలని ఆకాంక్ష. – ఎ.రాజప్ప, ధర్మవరం.

ఆనందపరవశం

ఇటీవల 'సప్తగిరి' నవరసభరితంగా అనేక భక్తి, ఆధ్యాత్మిక శీర్షికలతో ప్రచురిస్తున్నందుకు మిక్కిలి సంతోషిస్తూ, ఆనందపరవశం చెందుతున్నాము.

– శ్రీ సాయిగౌడ్, కాకినాడ.

ఆనందభరితం

తిరుమల తిరుపతి దేవస్థానములు రథసప్తమి పండుగ విశిష్టతతో ప్రతి సంవత్సరం మాఘశుద్ధసప్తమినాడు జరుపుతున్న ఆదిత్యజయంతి మహోత్సవం గురించి వివరంగా ప్రచురించిన వ్యాసం బాగుంది.

– కులకర్ణి రాజేశ్వరరావు, మహబూబ్‌నగర్.

2017 ఏప్రిల్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

05 శ్రీరామనవమి

02 నుండి 11వరకు
శ్రీపట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవాలు, వాయల్పాడు (వాల్మీకిపురం)

04 నుండి 14 వరకు
శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు, ఒంటిమిట్ట

08 నుండి 10 వరకు
శ్రీవేంకటేశ్వరస్వామివారి వసంతోత్సవాలు, తిరుమల

08 నుండి 10 వరకు
శ్రీకోదండరామస్వామివారి తెప్పోత్సవాలు, తిరుపతి

11 నుండి 20 వరకు
శ్రీవేదవల్లీ సమేత శ్రీవేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవాలు, నాగులాపురం

29 శ్రీ పరశురామ జయంతి

30 శ్రీశంకర జయంతి

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సప్తగిరి

సంపుటి : 47 మార్చి, 2017 సంచిక : 10



వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి ॥

గౌరవ సంపాదకుడు
డా॥ డి. సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

పర్యవేక్షకుడు
శ్రీ ఎన్.ముక్తేశ్వరరావు, ఐ.ఏ.ఎస్.(విశ్రాంత),
విశేషాధికారి, ప్రాజెక్టులు, తి.తి.దే.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు(ఎఫ్.ఎ.సి.),
సంపాదకుడు
డా॥ కె.రాధారమణ

ఉపసంపాదకురాలు
డా॥ అల్లాడి సంధ్య

ముద్రాపకురాలు
శ్రీమతి ఎమ్.గౌతమి, ఎం.బి.ఏ.,
ఉపకార్యనిర్వహణాధికారి(ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి

చిత్రకారుడు
శ్రీ పి.శివప్రసాద్, తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ పి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
0877-2264543

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఈ నెలలో....

ముఖచిత్రం : తిరుమల శ్రీవారి తెప్పోత్సవం
వెనుక చిత్రం : శ్రీకోదండరామస్వామివారు, తిరుపతి



ఉగాది

ఋతువులు మారుతూ ఉంటాయి. వాటితోబాటు అవి మనకు పంచి ఇచ్చే అనుభూతులు మారుతుంటాయి. అందుకే ప్రకృతి ఎప్పుడూ నిత్యనూతనంగా ఉంటుంది. శిశిరంలో మోడై పోయిన చెట్లన్నీ వసంతంలో చిగురించి కొత్త సింగారాలొలుకుతాయి. ఋతువుల్లో వసంతం మనోహరమైంది. ఆహ్లాదకరమైనదీనూ. 'ఋతూనాం కుసుమాకరః' ఋతువుల్లో వసంతఋతువు తానే అన్నాడు శ్రీకృష్ణుడు. అందుకే సంవత్సర ఆరంభానికి దీన్నే కాలమానంగా తీసుకొని తొలిఋతువుగానూ చెబుతారు. అలాంటి వసంతంలో వచ్చే తొలి మాసం చైత్రం. తిథుల్లో తొలి గౌరవం పాడ్యమిది. బ్రహ్మ సృష్టి ఆరంభించింది ఈ చైత్ర శుద్ధ పాడ్యమినాడే అంటోంది బ్రహ్మపురాణం. అదే యుగాది. అన్నీ తొలిగా వచ్చే ఆరోజునే తెలుగువారు తొలిపండుగగా **'ఉగాది'**ని జరుపుకుంటారు.

రామపట్టాభిషేకం జరిగిందీ, శ్రీకృష్ణుడు తన అవతారాన్ని చాలించిందీ, కలియుగం ప్రారంభమైందీ ఆ రోజేనని పండితులు చెబుతారు. ఖగోళ, జ్యోతిష శాస్త్రవేత్త వరాహమిహిరుడి అంచనాల ప్రకారం చైత్రమే తొలిమాసం. ఆరోజే తొలి పంచాంగాన్ని జన జీవన స్రవంతికి అంకితం చేశాడాయన. విక్రమార్కుడు, ఆంధ్రరాజుల చక్రవర్తి శాలివాహనుడు సింహాసనాన్ని అధిష్ఠించింది ఈ చైత్ర శుద్ధ పాడ్యమినాడే.

ఉగాది పచ్చడి

ఈ పండగ పేరు చెప్పగానే ఎవరికైనా ముందు గుర్తొచ్చేది 'ఉగాది పచ్చడి'. మామిడిపిందెలు, వేపపువ్వు, కొత్తబెల్లం, చింతపండు, పచ్చిమిరప, ఉప్పు వేసి చేసే ఈ పచ్చడిలోని ఆరురుచులు జీవితంలోని సుఖదుఃఖాలకు ప్రతీకలు. ఈ జీవనతత్త్వం ఎలా ఉన్నా వేసవి ఆరంభంలో షడ్రుచులతో గూడిన ఉగాది పచ్చడి తినడం వల్ల శరీరంలోని వాత, కఫ, పిత్త దోషాలేమయినా ఉంటే పోతాయంటారు. వేపపువ్వులో యాంటీసెప్టిక్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. క్రిముల్ని, చర్మరోగాల్ని నివారించే శక్తీ ఉంది. మామిడిముక్కలు రక్తప్రసరణదోషాలను నివారిస్తాయి. చింతపండు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొత్తబెల్లం వేడిని తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తుంది. పచ్చిమిరప చెవిపోటు, గొంతువాపు వంటి దుర్లక్షణాలను అరికడుతుంది. ధమనుల్లో కొవ్వు పేరుకోకుండా చూసే పని ఉప్పుది. కొత్తకుండలలో ఈ పచ్చడిని చేయడంవల్ల అది చల్లగా ఉంటుంది. వీటితోపాటు చెరకుముక్కలు, అరటిపండును కూడా కలుపుతుంటారు కొందరు.

పంచాంగ శ్రవణం : ఉగాదినాడు విధిగా పంచాంగశ్రవణం ఉంటుంది. ఇందులోనూ పరమార్థముంది. ఇది మన ఖగోళ శాస్త్రీయ దృక్కోణానికి అద్దంపట్టే సంప్రదాయం. ఇందులో ఐదు అంగాలుంటాయి. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు.

ఛత్రచామరాల సేకరణ : చైత్రం నుంచీ ప్రత్యక్షనారాయణుడి కిరణాల పదును పెరుగుతుంది. కాబట్టి గొడుగులు, విసనకర్రలు సేకరించుకుంటారు.

ప్రపాదాన ప్రారంభం : 'ప్రప' అంటే చలవపందిరి. ప్రపాదానం అంటే చలివేంద్రం పెట్టి దాహం తీరే తీర్థాలు ఇవ్వడం. అదీ ఈ రోజే ప్రారంభిస్తారు.

వసంత నవరాత్రి ఉత్సవం : ఉగాదితో ప్రారంభించి తొమ్మిదిరోజుల వరకూ ఈ వేడుకల్ని జరుపుతారు. ఏడాదిపొడవునా శుభం జరగాలని కోరుకుంటూ శ్రీరామనవమి తర్వాత వచ్చే దశమి వరకూ రాముడిని వేడుకుంటూ వీటిని నిర్వహిస్తారు.

చిన్న చిన్న మార్పులున్నప్పటికీ మన ఆచారాలూ, సంప్రదాయాలన్నింటిలోనూ ఏదో ఒక పరమార్థముంది. అందుకే వాటిని 'పండుగ'ల రూపంలో మన జీవనంలో భాగం చేశారు పెద్దలు.

కలియుగప్రత్యక్షదైవమైన శ్రీపద్మావతీ వేంకటేశ్వరుల అనుగ్రహం ఆశీస్సులు ఈ 'హేమలంబి' ఉగాదికి అందరికి పరిపూర్ణంగా లభించాలని ఆశిద్దాం.

చైత్రేమాసి జగద్బ్రహ్మ ససర్జ ప్రథమేఽహని ।
శుక్లపక్షే సమగ్రంతు తదా సూర్యోదయేసతి ॥

ఉగాది పండుగ ఎలా జరుపుకోవాలి?

(మార్చి - 29 ఉగాది సందర్భంగా..)



- డా॥ గార్లపాటి దామోదరనాయుడు

తే॥ హేమలంబి వత్సరమున ఎల్ల జనులు
శాంతి సుఖసంతసంబులు సందడిల్ల
బడయుదురుగాక కోరిన వన్నియు మహి
వేంకటేశుడు ప్రీతిగావించుగాక

కం॥ నూతన సంవత్సరమున
భూతల జనులెల్ల సుఖము పొందగప్రీతిన్
శ్రీ తిరుమల నిలయుండు స
నాతను డీక్షించు గాకనంత కరుణచే

పండుగలు

పండుగలు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకూ, ఆచారాలకూ కేంద్రబిందువులు. ప్రతి కుటుంబం వారు పండుగలు జరుపుకుంటారు. పండుగలు మానవులకు నూతన ఉత్సాహాన్ని ఆనందాన్ని కలిగిస్తాయి.

బంధువులు, మిత్రులు అందరూ కలుసుకోవడానికి పండుగలు ఉపకరిస్తాయి. తద్వారా మానవుల మధ్య ఐకమత్యం ఏర్పడుతుంది. దీనితో పాటు ఆధ్యాత్మిక చింతన ఏర్పడుతుంది.

ఆత్మకు సంబంధించి ఆత్మ పరంగా చేసేది ఆధ్యాత్మికత అవుతుంది. కొందరు ఆధ్యాత్మికత అంటే సర్వాన్ని త్యజించడం అనుకుంటారు. ఆ భావన తప్పు. మానవులు తమ బరువు బాధ్యతల్ని, బాధల్ని భగవంతునిపై వేయడం ఆధ్యాత్మికత కాదు. వాటన్నిటిని ఆత్మపరం చేయడమే ఆధ్యాత్మికత. అటువంటి ఆధ్యాత్మికచింతనను కలిగించడమే పండుగల పరమ ప్రయోజనం.

లోకక్షేమాన్ని కోరిన మన పూర్వఋషులు నక్షత్ర గమనాన్ని బట్టీ, ఋతువుల ధర్మాన్ని బట్టీ, ఆయా దేవతాప్రాశస్త్యాన్ని బట్టీ పండుగల్ని ఏర్పరచినారు. మానవుడు ఆహ్లాదంగా, ఆరోగ్యంగా జీవించడానికి ఏఏ కాలంలో ఏఏ కార్యక్రమాలు ఆచరించాలో, ఎటువంటి ఆహారాన్ని ఏ ఏ కాలంలో స్వీకరించాలో పండుగల ఆధారంగా మన పూర్వీకులు మనకు తెలియజేశారు.

ఉగాది

'వసంతం' ఋతువుల్లో మొదటిది. 'చైత్రం' మాసాల్లో మొదటిది. 'శుక్లపక్షం' పక్షాల్లో మొదటిది.

చారిత్రక గాథలు

1) శక పురుషుడైన శాలివాహనచక్రవర్తి చైత్రశుద్ధ పాడ్యమి నాడు పట్టాభిషిక్తుడైనాడని అదే ఉగాది అనేది ఒక చారిత్రక కథ.

2) విక్రమార్కశకం ప్రారంభమైనరోజు ఉగాది అని మరొక చారిత్రక కథ.

3) విశ్వవిఖ్యాతి చెందిన గణిత శాస్త్రవేత్త వరాహమిహిరుడు చైత్రశుద్ధపాడ్యమినాడే తన తొలి పంచాంగాన్ని ఆవిష్కరించాడని అదే ఉగాది పండుగగా జరుపుకుంటున్నామనేది ఇంకొక కథ.

పౌరాణిక గాథలు

01) శ్రీమహావిష్ణువు దశావతారాల్లో మత్స్యావతారం మొదటిది. ఈ అవతారాన్ని విష్ణువు ఉగాదినాడు ధరించినట్లు చెప్పబడుతూ ఉంది.

02) శ్రీరామచంద్రుడు వనవాసానంతరం రావణుని సంహరించి, అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషేకం చేసుకున్న శుభదినమే ఉగాది అని రామభక్తుల కథనం.

03) అనేక కష్టనష్టాలు అనుభవించిన తరువాత భారత కథలో ధర్మరాజు పట్టాభిషిక్తుడైనది ఉగాది నాడేనని ఒక కథ ప్రచారంలో ఉంది.

04) శ్రీకృష్ణుని వర్ధంతే ఉగాది అని కొందరి కథనం. శ్రీకృష్ణావతార పరిసమాప్తి ద్వాపరయుగాంత కలియుగ ప్రారంభమే ఉగాది పండుగ అని కొందరి భావన.

05) ఉగాది పండుగకు నారదుని కథకు ముడివడిన కథ ఒకటి లోకంలో ప్రచారంలో ఉంది. ఒకప్పుడు నారద మహర్షి విష్ణుమాయను, సంసారబంధాన్ని తెలుసుకోవాలని భావించగా, విష్ణువతని కోరికను మన్నిస్తాడు. విష్ణుమాయవల్ల కొలనులో స్నానంచేసిన నారదుడు స్త్రీరూపం పొందుతాడు. స్త్రీరూపంలోని నారదుని ఒకరాజు మోహించి వివాహమాడతాడు. వారికి అరవైమంది సంతానం కలుగుతారు. వారి పేర్లు ప్రభవ, విభవ మొదలైన ప్రస్తుత అరవై సంవత్సరాల పేర్లు.

కొంతకాలానికి క్షామం దాపురించి, రాజు సంతానం చచ్చిపోతారు. నారది విష్ణువును ప్రార్థిస్తుంది. విష్ణువు ప్రత్యక్షమై నారదిని నారదుడుగా అనుగ్రహిస్తాడు. అయినా నారదునికి సంతానంపైన మమకారం చావదు. అందువల్ల విష్ణువు ఆచంద్ర తారార్కం వారిపేర్లు నిలిచిఉంటాయని వారి పేర్లు మీదుగా సంవత్సరనామాలు ఏర్పాటు చేశాడని అవే తిరిగి తిరిగి వస్తుంటాయని అంటారు.

ఆ విధంగా నారదుని కథకు ఉగాదికి సంబంధం తెలపబడుతూ ఉంది.

'పాడ్యమి' తిథుల్లో మొదటిది. మొదలు అంటే ఆది. ఇన్ని ఆదులు కలిసేరోజు ఉగాది. ఉగాది వికృతి. యుగాది ప్రకృతి. ఉగాది ఆ సంవత్సరానికి తొలి పండుగ. ఉగాదికి సంవత్సరాది అని, ప్రకృతి పండుగ అని సంవత్సరేష్టియని పేర్లున్నాయి.

ప్రస్తుతం చైత్ర శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పండుగ జరుపుకుంటున్నాం. పరిశీలనవల్ల తేలే సారాంశ మేమిటంటే ఈ ఉగాది పండుగ కొంతకాలం వైశాఖంలోను తరువాత ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర, పుష్య, మాఘ, ఫాల్గుణ మాసాల్లోను జరుపుకున్నట్లు తెలుస్తున్నది.

ఉగాది ఆచారాలు

ఉగాది పండుగ చేసుకొనేవారు కొన్ని ఆచారాలను తప్పక పాటిస్తారు. అవి

1) తైలాభ్యంగనం

ఉగాది పండుగరోజు సూర్యోదయానికి పూర్వమే తైలాభ్యంగనం చేస్తారు. అందువల్ల గంగాభవాని, లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుందని మనవారి నమ్మకం. తైలాభ్యంగనం శుభసూచకం. ఆయుర్వేద శాస్త్రం తైలాభ్యంగనం వల్ల ఆరోగ్యం చేకూరుతుందని విశదపరచింది.

2) పతాక ప్రతిష్ఠాపన

దీన్నే ధ్వజారోహణం అనికూడా అంటారు. ఈ ఆచారం చాలా తక్కువమందిలో ఉంది. అదిగూడ కన్నడ, మహారాష్ట్ర ప్రజల్లో అతికొద్ది మంది మాత్రమే ఆచరిస్తున్నారు. ఇంటిముందు రంగవల్లికల మధ్య ఒక వెదురుకర్రను పాతి జరిఅంచుగల పట్టువస్త్రాన్ని దానికి పతాకంలాగ కడతారు. ఆ వెదురుకర్రకు మామిడి తోరణాలుకట్టి, వేప మండలు, పూలతో అలంకరిస్తారు. వాటితో పాటు ఒక చెంబును బోర్లిస్తారు. కొన్ని ప్రాంతాలలోని వారు కర్రపై టెంకాయను కూడ కడతారు.

3) ఉగాది పచ్చడి

ఈ ఉగాది పచ్చడికే ఉగాదిగొజ్జు, ఉగాది రసాయనం అనేపేర్లు కూడ ఉన్నాయి. ఉగాది రోజు అభ్యంగన



స్నానానంతరం, ఉగాది పచ్చడి తయారుచేసి దేవునికి నివేదనచేసి పరగడుపున ఈ పచ్చడి సేవిస్తారు. ఇందువల్ల కొత్త సంవత్సరంలో తమ భవిష్యత్తు ఆనందంగా ఉంటుందని భావిస్తారు.

ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనం. అవి– 1)తీపి 2) పులుపు 3) వగరు 4) చేదు 5) ఉప్పు 6) కారం. ఇన్ని రుచులు కలసిన ఈ పచ్చడి ఆస్వాదనీయమై ఉంటుంది. ఇందులో తీపికి కొత్తబెల్లం (కొందరు చక్కెర) ఉపయోగిస్తారు. అట్లే పులుపుకు కొత్త చింతపండు, వగరుకు మామిడి పిందె, చేదుకు వేపపూత లేక వేప చిగురు, ఉప్పు, కారం కొరకు పచ్చిమిరపకాయలు ఉపయోగిస్తారు. ఇందులోని ఒక్కొక్క రుచి ఒక్కొక్క భావానికి ప్రతీకలు. తీపి– సుఖానికి, చేదు– దుఃఖానికి ప్రతీకలు అట్లే మిగిలిన రుచులు కూడా కష్టనష్టాలకు, ఆనందాదులకు ప్రతీకలు. జీవితంలో ఇవన్నీ తప్పవని, వీటిని సమర్థవంతంగా స్వీకరించాలనే భావనను ఈ పచ్చడిని ఆస్వాదించడం ద్వారా గుర్తుంచుకోవాలనేది ఒక భావన.

4) పంచాంగ శ్రవణం

పంచాంగమంటే ఐదు అంగాలు కలది. ఆ ఐదు అంగాలు 1) తిథి 2) వారం 3) నక్షత్ర 4) యోగ 5) కరణాలు.

కాలస్వరూపుడైన జనార్ధనుడు నివసించేది 'తిథి'. ఆ జనార్ధనుణ్ణి సేవిస్తూ ఒక గ్రహం ప్రదక్షిణ చేసే దినం 'వారం'. క్షతంగాకుండా (నాశనం గాకుండా) రక్షించేది 'నక్షత్రం'. చంద్రుడు నక్షత్రంలో కలిసియున్న కాలం 'యోగం'. సాధనాన్నే 'కరణమం'టారు.

ఉగాది కార్యక్రమాలు

ఉగాదినాడు నూతన సంవత్సర ఆరంభ సూచనగా సంవత్సరానికి స్వాగతం పలికేటట్లుగ సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు ఏర్పాటు చేయబడతాయి. వ్యాపారస్థులు వ్యాపార లావాదేవీలను ఆరోజున ప్రారంభిస్తారు.


ఎ) సాంస్కృతిక కార్యక్రమాలు

ఉగాదినాడు ఉగాదికి ఆహ్వానం పలుకుతూ ప్రజలు నాటకాలు, నృత్యాల్లాంటి మనోరంజన కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటారు. అంతేగాక నూతన సాంస్కృతిక కళాసంస్థలు ఉగాదినాడు శాస్త్రోక్తంగా ప్రారంభించబడతాయి. సంగీత కచేరీలు ఏర్పాటు చేయబడతాయి. ప్రపంచ తెలుగు మహాసభలు ఉగాది నాడు ప్రారంభించియుండడం గమనింపదగిన అంశం. గ్రామాల్లో క్రీడలు, ఎడ్లబండ్ల పందేలు ఉగాదినాడు జరుపుకుంటారు.

బి) కవిసమ్మేళనలు

ఉగాదినాడు కవి సమ్మేళనాలు నిర్వహించుకోవడం తెలుగువారి ప్రత్యేకత. ఉగాదినిగూర్చి, ప్రత్యేకంగా ఆసంవత్సరం పేరునుగూర్చి, ఉగాదికి స్వాగతాన్ని పలికే వసంతకాలాన్ని గూర్చి కవులెందరో తమ కవితల్ని సభలలో వినిపిస్తారు. అంతేగాక ఉగాది పచ్చడిని గూర్చి, ఆ పచ్చడిలోని షడ్రుచుల విశేషాల్ని గూర్చి నేటి సమాజాన్నిగూర్చి, ప్రస్తుత రాజకీయ సాంఘిక, సామాజిక, ఆర్థిక అంశాల్ని గూర్చి కవులు తమ భావాల్ని ఉపమాది అలంకారాలతో అద్భుతంగా వర్ణిస్తారు. కవి సమ్మేళనాలతో పాటు, అష్టావధానాలు, శతావధానాలు కొన్నిచోట్ల ఏర్పాటుచేస్తారు. ఈ విధంగా ఉగాదికి స్వాగతం పలుకుతారు.

తే॥ షడ్రసోపేత జీవిత సౌరభంబు
ఆంధ్రులందు దీపించి మహత్వమొదవ
నా శుభాకాంక్ష తెలిపెద నయ్యలార
నవ ఉగాది సందర్భము నందు నేడు.




ఉగాదినాడు పంచాంగశ్రవణం విధిగా నిర్వహిస్తారు. సంవత్సర ఫలశ్రవణమే పంచాంగశ్రవణం. నూతన సంవత్సరంలో దేశానికి, రాష్ట్రానికి రాబోయే స్థితిగతులు, జయాపజయాలు, పంటల వృద్ధిక్షయాలు, మానవులకు ఆయానక్షత్రాలననుసరించి కలుగబోయే పరిణామాలు, గ్రహణాలు మొదలైన సమస్తవిషయాలు పంచాంగం ద్వారా తెలుస్తాయి.

పంచాంగ శ్రవణం మానవునికి ఆ సంవత్సర కాలంలోని జయాపజాయాలు, ఎదురయ్యే కష్టనష్టాలు ముందే సూచించడం వల్ల వారు తగిన జాగ్రత్తలు తీసుకొనే అవకాశముంది. ఉగాదినాడు పురోహితుని ద్వారా పంచాంగాన్ని చదివించి సంవత్సరం పేరు సంవత్సరాధిపతి, వర్షదేవత, ధనధాన్యాల అధిదేవతల పేర్లు మొదలైనవి వినాలని, ఆనాటి పంచాంగ శ్రవణం గంగాస్నాన ఫలాన్నిస్తుందని శాస్త్రవచనం.

వైకుంఠపాళి
:: 16 - సమాధానాలు ::

	1 న	2 ర	కా	3 సు	ర	4 వ	ధ	
5 కా		హి		ర		నం		6 త
7 వే	ణి		8 పా	రా	ణి		9 తో	ప
రి		10 కా		ట్టు		11 సిం		తి
	12 వి	న	త		13 లా	హి	రి	
14 ప		డ		15 ఎం		క		16 మే
17 హా	రం		18 క	డ	లి		19 చా	న
డి		20 వ		మా		21 స		క
	22 వె	న్నె	ల	వి	రి	దా	ల్లు	

(ప్రపంచంలోని సార్వభౌమాధికారం శ్రీవేంకటేశునిది. ఆయన ఇచ్చిన అధికారమే అందరిది కనుక ఆయన పాదాలు ప్రమాణంగా తీసుకొని మనమందరం ప్రవర్తించాలి. ఆయన పాదాలయందు గురి తప్పని భక్తిని కోరుకోవాలి. అటువంటి భక్తుల గురించి ఈ సంచికలో వివరించబడింది.)



08

తిరుమల విశిష్టత

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ

మనకి చాలా దగ్గరైన వ్యక్తి చాలా ఆప్యాయంగా ఉండేవాడు పెళ్ళికని బస్సుల్లో బయలుదేరితే మార్గమధ్యంలో మా ఇంట్లో కొద్దిగా టీ తీసుకుని వెళ్ళమని అంటారు. ఆ విషయం వెళ్ళే ముందరే చెపుతారు. అనుకోకుండా పాలు విరిగిపోయి గ్లాసు నిండా ఇవ్వలేక కొద్ది కొద్దిగానే టీ ఇస్తే వెనక బస్సులో దిగినవారు మెటికలు విరిచేస్తారు. చాలా గొప్ప స్నేహితుడని చెప్పాడు ఎంత గొప్పగా పెట్టాడో చూడమని అంటారు. మహర్షులందరూ వేంకటేశ్వరస్వామి వద్ద తమ గొప్ప చూపించడానికి చేతిలో నీళ్ళు పోసుకున్నారు. వేంకటేశ్వరస్వామి చూసి ఒక్కసారి హుత్కారం చేస్తే వారందరికీ కడుపు నిండిపోయినట్లు బరువెక్కిపోయి త్రేనుపులు వచ్చి, ఈ భోజనమెలా పెట్టావు? యోగమార్గంలో పెట్టావా? అని కింద పడిపోయారు. శుకబ్రహ్మ ఆశ్చర్యపోయి స్వామి నన్ను గట్టెక్కించారని స్వామి కాళ్ళమీద పడ్డారు. ఆయనని నమ్ముకున్న భక్తులను ఆదరించడం తెలుసు. స్వామిని నమ్ముకుంటే జీవితాన్ని గట్టెక్కిస్తారు.

అందరూ ఆకాశరాజుగారి ఇంటికి వెళ్ళారు. అద్భుతంగా పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం జరిగింది. ఆరునెలల పాటు వివాహమైన దంపతులు కొండ ఎక్కకూడదు కనక, అగస్త్యమహర్షి ఆశ్రమంలో ఉండమని అన్నారు. ఆ క్షేత్రంలోని మూర్తిని కల్యాణ వేంకటేశ్వరుడు అని పిలుస్తాము. ఆయన ఆరు నెలలు ఆశ్రమంలో గడిపారు. తొండమాన్ చక్రవర్తికి ఇచ్చిన ఆదేశం మేరకు ఆనందనిలయం కట్టారు. పరమపావనమూర్తి అయి, ఏకబేర దేవాలయంలోని మహానుభావుడు స్వామి మనని కటాక్షిస్తున్నారు.

వేంకటేశ్వరస్వామి చాలాకాలం నోరు విప్పి మాట్లాడారు. తొండమాన్ చక్రవర్తి మీద కోపం వచ్చి మాట్లాడడం మాని వేశారు. కూర్ముడు అని పేరు కలిగిన ఒక బ్రాహ్మణుడు గర్భవతి అయిన భార్యను కాశీ తీసుకుని వెళ్ళలేక జాగ్రత్తగా చూడమని ఆయనకి అప్ప చెప్పి వెళ్ళాడు. అలాగే చూస్తానని మాట ఇచ్చి, బ్రాహ్మణపత్నిని ఎవరైనా చూడకూడని చూపు చూస్తారేమో అని కావలసిన ద్రవ్యాలను లోపల పెట్టి తలుపులు బిగించి, ఒక ఇంట్లో ఉంచాడు. ఆరునెలలైనా ఆ బ్రాహ్మణుడు తిరిగి రాలేదు. ఆమె గురించి తొండమాన్ మరచిపోయాడు. ఉంచిన ద్రవ్యాలైపోయి ఆకలితో కేకలు వేసి వేసి, ఆమె, పిల్లవాడు, గర్భస్థ శిశువు మరణించారు. అస్థి పంజరాలు మాత్రం మిగిలాయి. కాశీపట్టణం నుండి కూర్ముడు తిరిగి వచ్చి నా భార్యా, పిల్లలు ఏరి? అని అడిగాడు. అప్పుడు తొండమాన్‌కి గుర్తువచ్చి చూసిరమ్మని పంపించాడు. హడలిపోయి బ్రాహ్మణునికి చెపితే శపిస్తాడేమోనని వేంకటాచలంలో స్వామివారి అభిషేకం చూడడానికి వెళ్ళారు. రేపు వస్తారు. మీరు విశ్రాంతి తీసుకోండని

చెప్పి, పరిగెత్తుకుంటూ స్వామివారి వద్దకు వెళ్ళి, ఆయన పాదాలు పట్టుకుని ప్రార్థన చేస్తే అస్థిపంజరాలు తెప్పించి స్వామి పాండవతీర్థంలో దిగి, ఆ నీరు తీసుకుని మంత్రించి, ఆ మంత్రజలాలతో ప్రోక్షణ చేసి వారి ముగ్గురినీ బతికించారు. రాజువై ఉండి ఇంత అహంకారంతో ప్రవర్తించినందు వలన ఈనాటి నుండి నేను నోరు విప్పి మాట్లాడను. ఎవరికైనా నా అనుగ్రహం ప్రసరించాలనుకుంటే, వేరొకరి ద్వారా ప్రసరిస్తుంది. ఉపకారం చెయ్యాలనుకుంటే వేరొకరి రూపంలో వచ్చి చేస్తాను. ఆనందనిలయంలోని శ్రీనివాసుడు ఇప్పటికీ తెలుగువారి కొంగు బంగారమై నిలబడ్డారు.

మహాభక్తులు వేంకటేశ్వరస్వామి దర్శనమైందనుకుంటారు. అసలు రహస్యం పాండితీ ప్రకర్ష ఉన్నవాళ్ళకు, ఎంతో గొప్ప సంప్రదాయాలతో పూజ చేశామన్నవాళ్ళకు కాదు, ఆయన లొంగేది. ఆయన దర్శనమిచ్చింది శ్రీకాళహస్తి క్షేత్రం పక్కన పల్లెటూళ్ళో ఒక చెట్టుపక్కన ఒక చెప్పులు కుట్టే వ్యక్తి ఉండేవాడు. ఆయన కటిక దరిద్రుడు. పిండి నీళ్ళల్లో ఉప్పు కలుపుకుని తాగేవాడు.

వేంకటాచలానికి ఇంకో పక్కన మదనపల్లె వైపు ఒక పల్లెటూరిలో ఒక చెప్పులు కుట్టే వ్యక్తి ఉండేవాడు. వీరిద్దరూ స్వామిని మహాభక్తిగా కొలిచేవారు. పిండి డాబా మీద ఆర పోసుకున్నారు. స్వామి ఒకరు ఆరపోసుకున్న పిండిమీద ఎడమ పాదం పెట్టారు. ఇంకో వ్యక్తి ఆరపోసుకున్న పిండి మీద కుడికాలు పెట్టారు. వారిద్దరూ పాదాన్ని చూశారు.

రేఖా మయధ్వజసుధాకలశాతపత్ర
వజ్రాంకుశాంబురుహకల్పకశంఖచక్రైః,
భవ్యైరలంకృతతలౌ పరతత్త్వచిహ్నైః
శ్రీ వేంకటేశచరణౌ శరణం ప్రపద్యే ॥

అందులో పాదముద్ర, శంఖముద్ర, వజ్రముద్ర కనబడ్డాయి. వాళ్ళు చెప్పులు కుట్టేవారు కనక జాగ్రత్తగా ముద్ర తీసి తోలుతో చెప్పులు కుట్టారు. అవి తీసుకుని ఒక రోజే వేంకటాచలానికి వచ్చారు. పక్కపక్కన పెడితే అవి వేంకటేశ్వర స్వామి పాదాలకు సరిపోయే చెప్పులయ్యాయి. యథార్థంగా జరిగిన సంఘటన!

కొండ ఎక్కే దారిలో ఇప్పటికీ చెప్పులిచ్చి తలమీద పెట్టుకుని ప్రదక్షిణం చెయ్యమని అంటారు. ఆ చెప్పుల జతలు అక్కడ ఉంచితే కొన్ని రోజులు అయ్యేటప్పటికి అరిగి పోతుంటాయి. ఎలా అరిగిపోతాయో ఎవరికీ తెలియదు. స్వామి చెప్పులు వేసుకుని ఏడుకొండలు దిగి, అమ్మవారి వద్దకు వెళ్ళి ఆమెతో కొంతసేపు గడిపి, మళ్ళీ ఏడుకొండలెక్కి పైకి వెళుతుంటారని ప్రతీతి. అన్నమాచార్యులవారు అలా దర్శనం చేశారు. మహానుభావులైన వాళ్ళెందరో దర్శనం చేశారు. పరమ పావనమైన అవతారం.

తొండమాన్ అహంకరించి నేను స్వర్ణతులసీ దళాలతో పూజిస్తున్నానని గర్వించాడు.

ఒకరోజు స్వామి పాదాల మీద మట్టి తులసి దళాలు కనబడ్డాయి. ఇదేమిటని ఆశ్చర్యపోతే స్వామి చెప్పారు. అసలు భక్తుడు నీవు కాదు. ఈ ఊరికి కొద్ది దూరములో భీముడు అన్న కుండలు చేసేవాడు ఉన్నాడు వెళ్ళి చూడు అన్నారు. తొండమాన్ గబగబా ఎండలో వెళ్ళాడు. అక్కడ ఒక కుమ్మరి ఉన్నాడు. ఆయన భార్య తమాలిని. ఆయన తన భార్యతో చిన్న వేంకటేశ్వరస్వామి మూర్తిని పెట్టుకుని మట్టితో తులసి దళాలు చేసి ఎంతో భక్తితో వేసేవాడు. ఎంత భక్తితో వేసేవాడు అంటే ఆ మట్టి తులసి దళాలు వెళ్ళి స్వామి పాదములమీద పడేవి. అది చూసి ఆశ్చర్యపోయి తొండమాన్ స్పృహ తప్పి పడి పోయాడు. భీముడు వచ్చి నీళ్ళు జల్లి పైకి లేపాడు. స్వామి ఆ భీమునికి చేసిన మహోపకారం లక్ష్మీదేవితో కలసి 'ఓడు' అంటే కుండపెంకు అందులో ఇంట్లో వండిన మజ్జిగ అన్నం తీసి పెట్టి తినమని అన్నాడు. తొండమాన్, వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవితో కలసి తిన్నారు. తిని స్వామి తనమీద ఉన్న వస్త్రాలు భీముడికి కప్పారు. లక్ష్మీదేవి తాను పెట్టుకున్న హారాలు తీసి తమాలినికి ఇచ్చింది. గరుడుడు వాహనంగా వచ్చి ఊర్ధ్వలోకాలకు తీసుకుని వెళ్ళాడు. తొండమాన్ గర్వం విరిగిపోయింది. అప్పుడాయన వేంకటేశ్వర స్వామి పాదాల వద్ద కైంకర్యం చేస్తూ ప్రాణాలు విడిచి పెట్టాడు. ఆయనని నమ్ముకున్నవారి కోసం అలా వచ్చే గొప్ప అవతారం వేంకటేశ్వరావతారము.

కఠినమైన మాట నిప్పుకన్నా ఎక్కువ బాధిస్తుంది

వేంకటాచలంలో లడ్డూలు కాని, జిలేబీలుకాని, పొంగళ్ళుకాని, ఏవీ కులశేఖరాళ్వార్‌పడి దాటి లోపల పెట్టి నివేదన చెయ్యరు. కులశేఖరాళ్వార్ శ్రీమహావిష్ణువుకి మహాభక్తుడు. ఆయన రోజూ నాకు స్వామి దర్శనం కావాలని మొదటి గడప అయ్యారు. సుప్రభాత సమయంలో పట్టుకుని వెళ్ళే పాలు, వెన్న మాత్రమే లోపలకు పట్టుకుని వెళతారు. మహానైవేద్యం ఇప్పటికీ వేంకటాచలంలో కొత్త కుండ పెంకు ఒక దాన్ని తీసుకుని అందులో పాలు, అన్నం లోపల పెట్టి తెర వేసి నివేదన చేస్తారు. ఆయన స్వీకరించే ఆహారాన్ని విరిగి పోయిన కుండపెంకులోనే తింటారు. భీముడు పెట్టాడు ఇలా ఆప్యాయతతో. పత్రం, పుష్పం, ఫలం, తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి. ఎన్ని కోట్లు ఖర్చుపెట్టి చేశారో ఎంత ఆడంబరంగా చేశారో ఆయనకు అనవసరం.

వటుర్వా గేహీ వా యతిరపి జటీ వా తదితరో
నరో వా యః కశ్చిద్భవతు భవ కిం తేన భవతి
యదీయ హృత్పద్మం యది భవదధీనం పశుపతే
త్వదీయస్త్వం శంభో భవసి భవ భారం చ వహసి ॥

నీ హృదయాన్ని నాకిచ్చావా! నిన్ను చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాను. ఇది స్వామి ప్రతిజ్ఞ. వేంకటేశ్వరస్వామి పైకి గొప్ప ఐశ్వర్యం. స్వీకరించేది కుండపెంకులో నిరాడంబరమైన ప్రసాదం. భక్తి ఉన్నచోట ఆయన ఉంటాడు. గోవిందా అని పిలిస్తే చాలు. ఏడుకొండలమీద ఎప్పుడూ వినబడే ధ్వని ఒకటే గోవిందా! గోవిందా!

మహానుభావుడు ఘంటసాల గారు పాడిన

కోటికీ పడగెత్తినా ధనవంతుడు, కూటికోసము
శ్రమపడే నిర్భాగ్యుడు నీ గుడి ముంగిటా సామాన్యుడు.

సమస్త ప్రపంచంలోని సార్వభౌమాధికారం ఆయనది. ఆయన ఇచ్చిన అధికారంతో అధికారాలు వెలగపెడుతున్నారు. ఆయన ఇవ్వని నాడు అధికారమెవరికుందీ? ఆయన పాదాలు ప్రమాణంగా తీసుకుని ప్రవర్తించాలి అధికారులు. ఐశ్వర్యాన్ని ఆయన విభూతిగా అనుభవించాలి. ఆయన పాదాలయందు గురి తప్పని భక్తిని కోరుకోవాలి. అటువంటి భక్తి ఉన్నప్పుడు విరిగిపోయిన కుండ పెంకులో పెట్టినా తింటాడు. హారతి తీసుకుంటాడు. రాత్రిపూట ఏకాంతసేవలో ఆయన బంగారంతో అల్లిన మంచం మీద పడుకోపెడితే ఆయన వినే పాట

జో అచ్యుతానంద జో జో ముకుందా.
రావె పరమానంద రామ గోవిందా.

అన్నమాచార్యులవారి వంశంలో పుట్టినవారు వచ్చి నిలబడి పాడాలి అనగా,

లోకములు నిదుర వోవగ
జో కొట్టుచు నిదురవోని సుభగుడు రమణుల్
జోకొట్టి పాడ నిదురం
గైకొను క్రియ నూరకుండెఁ గను దెఅవకయున్.

"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి"

అన్నమాచార్యుల కీర్తనకి నిదురపోయాడట. అటువంటి మహానుభావుడు. కలియుగంలో ఆయనే కర్మాకర్మ ఫలప్రదాత. ఆ స్వామి వైభవం చెప్పుకోవడానికీ, వినడానికీ ఎంతో అదృష్టం ఉండాలి. ఆ అదృష్టం కలిగినప్పుడే మన జన్మసార్థకమవుతుంది.

శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయమంగళమ్

స్వస్తి

విష్ణునివాసం

(యాత్రికుల వసతి సముదాయం)

శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం తిరుపతిలో నిర్మించిన యాత్రికుల వసతిసముదాయమే విష్ణునివాసం. ఇది తిరుపతి రైల్వేస్టేషన్ సమీపంలో ఉంది.

ఇతర వివరాలకు కాల్‌సెంటర్ - 0877-2277777, 2233333.



సజ్జనాశ్రయులు

– శ్రీ ఈ. అనంతరంగరామన్,
98854 60460

మార్చి , 6
కాంచీపూర్ణులు
తిరునక్షత్రం
సందర్భంగా.....

తిరుక్కచ్చినంబి యామునాచార్యుల శిష్యులలో ఒకరు.

మొదట కొన్నాళ్లు తిరుమలలో శ్రీనివాసునకు ఆలవట్టం (వీవన)ను వీచే సేవను చేసి ఆ స్వామి ఆదేశానుసారం కంచిలోని వరదరాజస్వామికి ఆ కైంకర్యాన్ని నిత్యంగా చేశారు.

మరిన్ని వివరాలకు చదవండి.....

దేవరాజదయాపాత్రం శ్రీకాంచీపూర్ణముత్తమమ్ ।
రామానుజమునేర్మాన్యం వందేహం సజ్జనాశ్రయమ్ ॥

(కంచివరదరాజస్వామి దయకు పాత్రమైనవారు, ఉత్తములు, శ్రీరామానుజులకు గౌరవనీయులు, సజ్జనులచే ఆశ్రయింపబడేవారైన కాంచీపూర్ణులనే తిరుక్కచ్చినంబిని నమస్కరిస్తున్నాను.)

ఈ శ్లోకం తిరుక్కచ్చినంబి (కాంచీపూర్ణులు) అనే మహనీయులను స్తుతించే శ్లోకం. భగవద్రామానుజులు మిక్కిలి అభిమానించి, తమ ఆచార్యులతో సమానంగా గౌరవించిన జ్ఞాన భక్తి వైరాగ్య అనుష్ఠానాలను కలవారు కాంచీపూర్ణులు.

వీరు క్రీ.శ. 1009వ సం॥లో మాఘమాసం మృగశీర్షా నక్షత్రంలో వైశ్యకులానికి చెందిన కమల, వీరరాఘవ దంపతులకు ""పూవిరున్దమల్లి" (పూన్దమల్లి– ఇది ఇపుడు చెన్నై నగరంలో ఉన్నది)లో జన్మించారు. వీరు శబరి అంశలో జన్మించారని సాంప్రదాయిక విశ్వాసం. వీరికి తండ్రి పెట్టిన పేరు భార్గవప్రియులు.

వీరు శ్రీయామునాచర్యులవారి శిష్యులలో ఒకరు. మొదట కొన్నాళ్ళు తిరుమలలో శ్రీనివాసునకు ఆలవట్టం (వీవన)ను వీచే సేవను చేసి, ఆ స్వామి ఆదేశానుసారం కంచిలోని వరద రాజస్వామికి ఆ కైంకర్యాన్ని నిత్యంగా చేశారు. వీరి భక్తికి మెచ్చిన కంచివరదుడు ప్రతినాడు రాత్రివేళ సేవా సమయంలో వీరితో నేరుగా సంభాషించేవాడట.

శ్రీరామానుజులు తమకుగల సందేహాలను కాంచీపూర్ణుల ద్వారా వరదరాజస్వామిని అడిగి, వారిద్వారా సమాధానాన్ని పొందారు. వీటికే షడ్వార్తలు(ఆరు వార్తలు) అని పేరు. వీటిని ఆధారంగా చేసికొనే శ్రీరామానుజులు తమ భవిష్యత్ప్రణాళికని నిశ్చయించుకొన్నారు. వరదరాజస్వామి ఆజ్ఞానుసారంగా గోష్ఠీపూర్ణుల (వీరు కూడా యామునుల శిష్యులు) వద్దకు వెళ్ళి చిరకాలం వారికి సేవచేసి, వారి అభిమానాన్ని సంపాదించి, ఆ అభిమానం కారణంగా వరదునివద్ద మోక్షాన్ని పొందారు.

శ్రీరామానుజులు వీరిని ఆచార్యులుగా ఆశ్రయించాలని ప్రయత్నించినా, ఆనాటి సంఘవ్యవస్థను బట్టి అంగీకరించలేదు. అయినా, శ్రీరామానుజులు వీరిని ఆచార్య సమానులుగానే సంభావించారు. కాంచీపూర్ణులు కంచివరదరాజస్వామిని స్తుతిస్తూ దేవరాజాష్టకమనే ఎనిమిది శ్లోకాలు గల స్తుతిని రచించారు. ఇది, శ్రీయామునుల స్తోత్రరత్నానికి సంక్షిప్తరూపమని విజ్ఞులంటారు.

కంచిని వదలి, శ్రీరంగంలో నిత్యవాసం చేస్తూ, విశిష్టాద్వైత సంప్రదాయ ప్రచారాన్ని చేసే సమయంలో కూడా శ్రీరామానుజులు వీరిని మరువలేదు. వీరిని సదాస్మరిస్తూ ఉండేవారు. ఈ విషయాన్ని తెలిపే ఒక సందర్భాన్ని నంబిళ్ళై "తిరువిరుత్తమ్"– అనే నమ్మాళ్వార్ల ప్రథమ ప్రబంధంలోని 8వ పాశురాన్ని వ్యాఖ్యానిస్తూ ప్రస్తావించారు.

ఒకనాడు శ్రీరామానుజులు తమ శిష్యులతో, మహాపూర్ణులు (శ్రీరామానుజులు ఆచార్యులలో ఒకరు) మొదలైన వారితో శాస్త్రచర్చను చేస్తూ ఉండగా, తిరుక్కచ్చినంబి

స్మరణ శ్రీరామానుజులకు కల్గింది. వెంటనే వారు "కంచికిపోయి, తిరుక్కచ్చినంబి క్షేమాన్ని తెలిసికొని వచ్చే వారెవరైనా ఉంటే బాగుం టుంది" అనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. మఱునాడే మహా పూర్ణులు, కంచికి వెళ్లి నంబి క్షేమాన్ని తెలిసికొని, శ్రీరామానుజు లకు తెలుపడం జరిగింది.

తిరుక్కచ్చినంబి గొప్పతనాన్ని తెలిపే ఇంకొక ఉదంతం "వార్తా మాల" అనే సాంప్రదాయిక సూక్తి సంకలనాత్మకమైన గ్రంథంలోని 150వ వార్త (సూక్తి)లో కన్పిస్తుంది.


తిరుక్కచ్చినంబి వద్దకు ఒక శ్రీవైష్ణవుడు వెళ్లి, మిమ్ములను ఆశ్రయించాలని వచ్చానని ప్రార్థించాడు. ఆ రాత్రి నంబి ఈ విషయం వరదరాజస్వామికి నివేదించగా, "నేనే మోక్షానికి ఉపాయం, నా కైంకర్యమే పరమార్థం" అనే విషయాన్ని ఆయనకు ఉపదేశించండి అని వరదరాజస్వామి అనుజ్ఞ ఇచ్చాడు. నంబి ఆ విధంగానే ఆ శ్రీవైష్ణవునకు ఉపదేశించాడు. అప్పటినుండి ఆ వైష్ణవుడు నంబిని విడువకుండా వెంటనే ఉండి సేవచేయడం గమనించిన అతని బంధువులు, వేరొక కులానికి చెందిన నంబిని అతడు ఆశ్రయించడం సహించలేక, అతనికి ప్రాయశ్చిత్తం చేయాలని యత్నించారు. ఆ ప్రయత్నాన్ని సహించలేని ఆ వైష్ణవుడు మిక్కిలి ఆర్తితో పరమపదిం చాడు. ఈ ఐతిహ్యం తిరుక్కచ్చినంబి జ్ఞానవైలక్షణ్యాన్ని తెల్పుతుంది.

తిరుక్కచ్చినంబికి "గజేంద్రదాసు"దని పేరు. ఈ పేరును వీరికి వరదరాజస్వామి ప్రీతితో పెట్టాడు. ఈ వృత్తాంతాన్ని తెలిపే సందర్భం కూడా ఆళ్వార్ల దివ్యప్రబంధాల వ్యాఖ్యానంలో గోచరిస్తుంది. ఇది పెరియాళ్వార్ తిరుమొళిలోని 3-7-8వ పాశురవ్యాఖ్యలో కన్పిస్తుంది.

తిరుక్కచ్చినంబి వరదరాజస్వామిని "మీకు ఇష్టమైన ఒక పేరును నాకు పెట్టాలి" అని ప్రార్థించగా, వరదుడు "ఇప్పటి నుండి నిన్ను శ్రీగజేంద్రదాసుడని పిలుస్తారు. అదే నీ పేరు" అని అన్నాడు. ఈ పేరును పెట్టడంలో ఒక కారణం ఉన్నది.

పూర్వం గజేంద్రుడు చిరకాలం కంచి లోని వరదరాజస్వామి కోవెలలోగల సరస్సులో స్నానమాడి, స్వామిని చిరకాలం ఆరాధించి, ఆ స్వామి ప్రీతికి పాత్రమయ్యాడు - అని పురాణోక్తి. ఆ విధంగానే తిరుక్కచ్చినంబి వరదునకు చిరకాలం వీవనను వీచే సేవను చేసినందున, తనకు చాలా ప్రీతిపాత్రమైన నంబికి గజేంద్రుని పేరును కలిపి గజేంద్రదాసుడనే పేరును పెట్టాడట.

ఈ పరిశుద్ధ జ్ఞానభక్త్యనుష్ఠానాలకు నిధి అయిన తిరుక్కచ్చినంబి వైభవస్మరణం పుణ్యదాయికం.



(గతసంచిక తరువాయి భాగం...)

కావేరినదికి దక్షిణాన 'నిచుళాపురం'. ఆ నిచుళాపురం అమరావతిలాగా శోభాయమానం. ఆ నగరానికి రాజు రాయచౌహత్తమల్లుడు. ఆ రాజు ఒకరోజు శ్రీ రంగనాథుని సేవించడానికి శ్రీరంగం వెళ్ళాడు. శ్రీ రంగేశుని సేవించి తన పట్టణానికి తిరిగి వస్తుండగా దారిలో ఒక కాసారాన్ని చూచాడు. ఆ కాసారం నడుమ అచ్చెర్వుగొలిపే ఒక పద్మం. ఆ పద్మంలో లక్ష్మిలాగ ఒక పాప. రాయచౌహత్తమల్లుడు కాసారాన్ని, కాసారం మధ్యగల పద్మాన్ని పద్మంలోని లచ్చిలాంటి పాపను చూచాడు. ఆ పాప పద్మమనే బంగారు బొమ్మరిల్లులో రత్నాల బొమ్మగా ఉంది. ఒక పేదవాడు పెన్నిధిని చూస్తే సంతోషపడేలా రాజు మురిసిపోయాడు. ఆ మురిపానికి, ఆ సంతోషానికి కారణం లేకపోలేదు. రాయచౌహత్త మల్లుడు అంతవరకు సంతానహీనుడు. కాసారంలోని బాలికను చూశాక ఆ మల్లునికి ఆశపుట్టింది. ఈ పాపను పెంచుకొంటే?

పిల్లలు లేరని బాధపడే పట్టమహిషికి దైవదత్తమయిన బిడ్డగా అందిస్తే?

రాజు ఇంక ఆలస్యం చేయదలచుకోలేదు. ఆ శిశువును చేత ఎత్తుకొన్నాడు. పట్టణానికి వెళ్ళి పట్ట మహిషికి అందించాడు. పట్టమహిషికి పట్టరాని సంతోషం. పద్మజాత గనుక 'పద్మిని' అన్నారు. పాప పెరుగుతూవుంది. వంపుసొంపులు అమరుతున్నాయి. ఆ పాప పూరెమ్మలా, సింగారపు కుప్పగా, అపరంజీనక్కులా కనిపించేది. అయినా ఆమెలో ఆ చిన్నవయసులో ఎవరూ బోధించని 'శ్రీరంగస్వామిపై భక్తి'.

రంగేశుడు సామాన్యుడా?

రాతికి ప్రాణం పోసినవాడు. మునుల హృదయాలలో ధ్యానింపబడే పాదపద్ముడు. పీతాంబరుడు. తాను పుడుతూ లోకాలను పుట్టించినవాడు. బ్రహ్మదేవుని పుట్టుకకు

10



పరమయోగివిలాసం

– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

పుట్టిల్లైనవాడు. పరాంకుశాది మునులచే ప్రస్తుతింపబడేవాడు.

నేలకు ఆకాశానికి దారంతో కట్టిపడే యాలి అనుకొనేంత మనస్తత్వం పాపది. అయినా ఆశ చెడ్డది. వలపు అంతకంటె చెడ్డది. దివ్యప్రబంధాలలోని శ్రీరంగని శ్రీయుతాకారవర్ణనలను చదివి పద్మిని మనసు పారవేసుకొంది. మానినీ చిత్త చోరుని మనసా వరునిగా చిత్రీకరించుకొంది.

ఇంకేం? ఊహలు చిగురులు తొడిగాయి. రకరకాలయిన భావనలు అంతరంగంలో మెరిశాయి.

చెలికత్తెలు 'పద్మిని'ని ఒక కంట కని పెడుతూనే ఉన్నారు. ఆమెలోని 'మార్పు' పసిగట్టారు. ఎవరిమీద మనసు పారిందో అని తర్కించుకొంటున్నారు. ఉపేక్ష చేస్తే మన్మథుడు పద్మినిని వేధిస్తాడని మార్పు కోసం చెలికత్తెలు పద్మినితో వనవిహారానికి కదిలారు.

జవ్వనులు అడుగుపెడుతుంటేనే ఉద్యాన వనం జవజవలాడింది. కొన్ని చెట్లకు ముసలితనంపోయింది. వనమంతా వసంత విహారమే మదవతులు తమ్ము కౌగలించుకోకూడదా అని కొన్ని ఆశగా చూశాయి. దగ్గర నిలబడి పాటపాడ కూడదా అని తపించాయి కొన్ని. ఒక్కసారి నవ్వితే చాలు అని ఎదురుచూశాయి కొన్ని. ఒక్కమాట మాట లాడితే చాలనుకొన్నాయి కొన్ని, ఆ మహీజాల అనురాగాలను మదవతులు తృణీకరించలేదు. తమ నిజరూప హావభావాలతో వనరాశిని ఆనందంలో ముంచారు.

సరిగ్గా అదే సమయానికి రంగ భూపతి ప్రవేశించాడు. అతనిది మనోహర రూపం. ఆ స్వామి కస్తూరినామాలవాడు. చెంగావి దట్టీవాడు. ముత్తియపు పోగులవాడు. వీడీవీడని నెడజారుకొప్పులవాడు. అయినా రంగభూపతి వేటగానిలా కనబడ్డాడు. పరస్పరం జగిడించే వేదాలనే సారమేయాలు ముందుకు ఉరుకుతున్నాయి. జంతువులను

పట్టడానికి రకరకాల వలలు కనిపిస్తున్నాయి. ఉపాయంతో వేటాడ తెలిసిన వాడు అలాంటి వేటగానిని పద్మిని చూచింది.

రంగడు సామాన్యుడా?

ఒక వీక్షణంతో పద్మిని తలపు పసిగట్టాడు. సొంపుచూపులతో సొక్కించాడు. తదనంతరం తిరువరంగం చేరాడు. రంగని చూచిన పద్మిని మనసు మనసులో లేదు.

చెలికత్తెలు పద్మినిని చూచి నివ్వెరపోయారు. ఉపచారాలు చేశారు. ఎవరిని పిలవాలో ఎవరికి చెప్పాలో తెలియని మానసికస్థితి. దైవంమీద భారం వేశారు.

అంచేత

శ్రీవేంకటేశ్వరు చింతింపరమ్మ

రామనామము పదరక యెన్నరమ్మ' అంటూ ఉపశమనానికి దారులు వెదికారు.

చివరకు పద్మిని తెప్పరిల్లింది. చెలులు పద్మినిని బుజ్జగించి ఆమె అంతరంగం తెలుసుకొన్నారు. నగరిబాట పట్టారు.

ఈలోగా తండ్రి 'రాయచౌహత్తహల్లు' రానే వచ్చాడు. పద్మినికేసి చూశాడు.

'అమ్మా! మునుపటిలా నీవు లేవు. అయినా నీవు జవ్వనివి. మా యమ్మా! నీకేలాంటి మగడు కావాలో చెప్పవమ్మా. నీకేం భయంలేదు. నా బిడ్డవు కదా' అని ప్రశ్నించాడు. పద్మిని ఆలోచించింది. ముసి ముసి నవ్వులతో ముద్దుమోముతో 'తండ్రీ నేను నరుని కోరడం లేదు. పరాత్పరుడయిన రంగవరుడే నా వరుడు.' అంది.

రాజు నివ్వెరపోయాడు.

బ్రహ్మాదులకే అగోచరుడూ, అర్చావతారమూర్తి, రంగనాథుని కోరడం ఏలా? ఒకవేళ సాక్షాత్కరించినా 'పద్మినిని' కూర్చడం ఎలా? లోకంలో బిడ్డను పిలిచి, అడుగు. ఏదైనా తెచ్చి ఇస్తానంటే, చందమామలోని వెన్నను అడిగినట్టుగా ఉంది' అని ఆలోచనలోపడ్డాడు.

సరిగ్గా అదే సమయానికి శ్రీరంగడు సాక్షాత్కరించాడు.

బంగారుకొండపై నీలశృంగంలాగా పసిడిరెక్కల గరుడుని మీదెక్కి దేవతలు సేవిస్తుంటే కదలివచ్చాడు.

అంతేకాదు. రాజును పిలువనంపాడు. 'రాయచౌహత్తమల్లు! నీ గారాలబిడ్డను నాకిచ్చి పెండ్లి సేయవయ్యా! నీవు అడగ దానికి జంకుతావని నేనే వచ్చాను' అనగానే రాజు స్వామి పాదాల వాలాడు.

'రంగ! అభంగ! ఏమి నా భాగ్యం. నేను ధన్యుణ్ణి. కృతార్థుణ్ణి' అంటూ నగరమంతా శోభాయమానంగా అలంకరింపజేశాడు. శుభలగ్నంలో శాస్త్రోక్తంగా వివాహం జరిపించాడు. కానుకలుగా వనజేక్షణల్ని, వాహనాల్ని, రత్నధనాదివస్తువులని ఇవ్వడమే గాకుండా రంగనికి రమణీయ సౌధమంటపాలు కట్టించినాడు. తదనంతరం భక్తితో కాలం గడిపాడు.

పరమ మై యొప్పు నీ పద్మినీ కన్య
చరితంబు ధరలోన జనులెవ్వరేని
వినిన వ్రాసిన చదివిన బేరుకొన్న
నెనలేని తదభీష్టం లొదవు

అని తిరువేంగళనాథులు ఫలశ్రుతి చెప్పారు.

నిచుళాపురం శ్రీరంగనాథుల మామగారివూరు. శ్రీరంగనాథుడే కోరి కోరి వచ్చి 'పద్మినిని' పెళ్ళాడిన ఊరు. ఆ మహానగరంలోనే శ్రీ మహావిష్ణువు 'శ్రీవత్స' అంశంతో ఒక కవియోగి జన్మించాడు.

ఆ మహాపురుషుడు జన్మించిన మాసం 'కార్తిక' మాసం. ఆనాటి తార రోహిణి. ఆ యోగి జన్మించిన నాటినుండి ఆ మహాపురుషునికి సదా 'శ్రీరంగేశనామామృతచింత'. పసిబాలురకు సహజమయిన ప్రకృతిరోదనం లేదు. ఆ బిడ్డకు భూలోకవాసులకున్న ఆహారచింత, ఆకలి రెండూ లేవు. జలజాక్షుని భక్తే ఆ భక్తునికి పోషకం. అదే యోగానందం. అతని పేరే 'తిరుప్పాణ్'.

దైవకృపతో పుట్టుకనాటనే ఆ శిశువుకు సకలవిద్యలు అబ్బాయి. అయినా 'తిరుప్పాణ్' కు సంగీతమంటే ఇష్టం. వేణుగానమంటే వల్లమాలిన ప్రీతి.

తన సంగీతంతో శ్రీరంగనాథుని మెప్పించాలని ఆరాటం. కాని ఆ రోజుల్లో కొందరికి ఆలయ ప్రవేశం నిషిద్ధం. అయినా 'పాణార్' ఊరుకోలేదు. వేణువు చేతబట్టి కావేరీనదీతీరాలలో 'శ్రీరంగం' కనబడేలా కూర్చొని గానం చేసేవాడు.

ఆతని సంగీతం ముగ్ధమనోహరం. రమణీయం. శాస్త్రసమ్మతం. అంతేకాదు రాళ్లరిగించే రమ్యనాదం. సామవేదగానతుల్యం. సకలజనులకు కర్ణామృతం.

కావేరీనదీతీరంలో బ్రాహ్మీముహూర్తంనుండి నడిరేయి దాకా సాగే 'పాణార్' గానం కావేరీనదీ ప్రవాహంలా సాగేది.

ఇలా ఎన్నో సంవత్సరాలు గడిచాయి.

శ్రీ రంగనాథులు సంకీర్తన కైంకర్యానికి ముగ్ధులయ్యారు. 'వేదాలలో సామగానం నేను' అనడాన్ని సార్థకం చేసిన సద్భక్తుడని పరవశించాడు. తన సంతోషాన్ని శ్రీరంగనాయికతో పంచుకోవాలని భావించాడు.

'పద్మా! విన్నావా? యోగినాథుని గానాన్ని. వీనులవిందయిన సంగీతాన్ని అమరులు ఆస్వాదించే అమృతం కంటె తియ్యని గేయాల్ని' అన్నాడు.

'దేవా! విన్నాను. అయినా నాకొక సందేహం. దేవరను స్తుతించే వాణ్ణి, ప్రాణప్రదమయినవాణ్ణి. పరిపూర్ణమయిన పదపద్మభక్తి కలవాణ్ణి, శ్రీరంగం బయట అనాథలా ఉంచడమా? ఇది సబబా? పరమాప్తుడు కదా! దగ్గరికి చేర్చుకోకూడదా' అని ఆవేదన ప్రకటించింది.

రమాధిపుడు ఆలోచించాడు. తగిన పథకం వేశాడు. సంకల్పం కార్యాచరణకు నోచుకొంది.

అపుడే తనకు కావేరీనదీ పుణ్యతోయాలతో అభిషేకం చేయడానికి సర్వం సన్నద్ధం చేయడానికి సిద్ధమవుతుంటే శ్రీరంగనాథులు ప్రధాన అర్చకులతో

'అర్చకవర్యా! కావేరీనదినుండి నా అభిషేకం కోసం హేమకుంభంలో పవిత్రజలాలను తేవడం నాకు మహదానందమే! అలాగే నీవు అనుదినం తెచ్చే కావేరీనదీతీరంలోనే నా సద్గుణాలను వీణానాదంగా పలికించే గాయకోత్తముని నా దగ్గరికి పిలుచుకురా' అన్నారు.

అర్చకముఖ్యులు ఆనందంతో పరవశించారు.

'ఆహా! ఏమి నాభాగ్యం. బ్రహ్మాదులకు కనరాని కమలలోచనుడు నాపై కరుణించాడు. అయినా కావేరీనదీతీరంలో గాన కైంకర్యం చేసేవారు సామాన్యులా? నారదాదులకంటె ఘనులు కాదా?" అంటూ నదికేసి నడిచారు. లోకసారంగులు తిరుప్పాణ్‌కేసి అడుగులు వేస్తుండగా పాణార్–

'స్వామీ! ఆగండి.... ఆగండి... ఎటుకేసి వస్తున్నారు.' అంటుంటే లోకసారంగులు ఆ మునిని పట్టుకొని భుజం మీది కెత్తించుకొని రంగేశుని సన్నిధికి తోడి తెచ్చారు. తిరుప్పాణార్ ఊహించని పరిణామం. 'వైకుంఠధామం పొలిమేరలో అడుగుపెట్టే అర్హత లేనివానికి ఈ భాగ్యమా? ప్రధాన అర్చకుల భుజాలమీద శ్రీరంగనాథస్వామి ఆలయ ప్రవేశమా?

ఒక్కసారిగా గతుక్కుమన్నాడు.

ఉభయకావేరులమధ్య పవళించిన మనోహరాకారుని చూచి 'అమలనాదిపిరాన్' అని స్తోత్రం మొదలెట్టారు. రంగనాథ! దాసులకు దాసునిగా చేసిన నీ దయావిశేషం ఏమనాలి? శ్రీ వేంకటేశ్వరుని పాదకమల సందర్శనం నాకు కలిగింది. ప్రసన్నుడు. అఖిలలోకాలు కొలిచినవాడు. దైత్యులను తుద ముట్టించినవాడు. కాకుస్థకులతిలకుడయిన శ్రీరామచంద్రుల పీతాంబరంపై నా దృష్టి నాటింది. వేంకటేశ్వరుని పొక్కిలిలో జన్మించి సంధ్యకాలం నాటి ఎర్రదనంతో సమానంగా కనిపించే చెంగావి వలువ నాకు ప్రాణప్రదమయింది. లంకాధిపతుల పది తలలను ఛేదించి లంకా నగరంలో ప్రకాశించిన దేవుని ఉదరబంధం(మొలనూలు) నాకనుల కనుపట్టింది.

జన్మజన్మలలో నేను చేసిన ఘోర అపరాధాలను తన కత్తితో నరికి తనవానిగా చేసి నా తలపులో నిలిచిన శ్రీరంగధారుణి నాథుని శ్రీవత్సతలమే నన్ను దాసునిగా చేసింది' అంటూ

శ్రీ పాదాలను, చక్రాన్ని, ప్రవాళ అధరాలను, కన్నుదామరలను తిరుమేనిని తనివితీరా వర్ణించి గాన కైంకర్యం చేశాడు. ఆ యోగివర్యుని ప్రత్యంగవర్ణన గీతమే ఒక ద్రావిడ ప్రబంధమయింది.

'నవనీతచోరుని, నా మనోహరుని, అవిరళ శుభమూర్తిని రంగశాయిని దర్శించిన కళ్ళతో వేరేవీ నేను చూడదలచుకోలేదు" అంటూ పాదాదికేశ పర్యంతం వర్ణించిన తిరుప్పాణర్ స్వామిలోనే లీనమయ్యాడు.

లోకసారంగముని భుజాలమీదికి ఎక్కడంవల్ల లోకంలో ఆ యోగికి మునివాహనుడనే పేరు ప్రచార మయింది. ఎవరయితే ఈ యోగికథను భక్తితో విన్నా, వ్రాసినా, చదివినా, స్తుతిచేసినా శ్రీరంగపతి 'సిరికినిచ్చిన చనవిచ్చు'.

ఈ వృత్తాంతంతో పరమయోగివిలాసం తృతీయాశ్వాసం ముగిసింది.

తిరుప్పాణార్‌కే అష్టమయోగి, వీణాయోగి, గాయకయోగి, గానముని, కవియోగి, తత్త్వముని, తటముని, రోహిణీ ముని, కావేరీతీర ముని, నిచుళాపురయోగి అని నామాంతరాలు

'వృశ్చికే రోహిణీ జాతం
శ్రీపాణం నిచుళాపురే
శ్రీవత్సాంశం గాయకేంద్రం
మునివాహన మాశ్రయే'

– అని సంప్రదాయ ప్రార్థన.

(ఇంకా ఉంది)

బాలప్రబోధం

ధర్మదేవత

– శ్రీ కె.వై.హర్షవర్ధన్ కుమార్

పిప్పలాదుడు ఒక ముని. తపోదీక్షతో జీవితం గడిపే వాడు. ఒకనాడు నదీతీరంలో విహరిస్తున్న రాజ కుమార్తెను చూశాడు. వెంటనే రాజు వద్దకు వెళ్లాడు. 'నాకు పెళ్ళి చేసుకోవాలని ఉంది. నీ పుత్రికను నాకియ్యి' అన్నాడు. రాజు అనరణ్యుడు మునిమాటకు ఎదురు చెప్పలేదు. తన కుమార్తెను అతనికిచ్చి వివాహం చేశాడు. పద్మ తన భర్త వెంటే ఆశ్రమవాసానికి వెళ్ళింది.

ఒకనాడు ఆమె గంగానదికి స్నానానికి పోతూం డగా, దారిలో ధర్మదేవత బంగారు రథమెక్కి, రాజువేషంతో ఆమెకు ఎదురుపడ్డాడు. అతను పద్మను చూసి, 'ఓ లావణ్య వతీ! లక్ష్మీదేవిలా చూడచక్కగా ఉన్నావు. నీకు ఆ వృద్ధతాపసి తగినవాడు కాడు. నన్ను చూడు..... రాజును! యువకుణ్ణి! నీకు అన్ని విధాలా తగినవాణ్ణి. ఆ ముసలివాణ్ణి వదిలి, నాతో జీవించు' అన్నాడు.

అందుకు ఆమె, 'బుద్ధిహీనుడా! కామాం ధుడవై బలము, యవ్వనమూ ఉన్నాయన్న గర్వంతో, మహాతపోనిధి అయిన నా భర్తను దూషించావు. కనుక నువ్వు నాశనం అయి పోతావు' అని శపించింది. అప్పుడు ధర్మదేవత పద్మకిరీటంతో, పద్మహారాలతో, పద్మభూషణా లతో నిజస్వరూపాన్ని చూపి, పద్మకు నమస్క రించి, 'అమ్మా! నేను ధర్మదేవతను! అన్యకాంత లను తల్లిగా చూసేవాణ్ణి. పరులపట్ల నీ మనస్సు చలించదని తెలిసికూడా నిన్నిలా పరీక్షించడానికి సాహసించడం బహుశా ఈశ్వర సంకల్పమేమో!' అన్నాడు.

ధర్మదేవత మాటలు విని పశ్చాత్తాపం చెందిన పద్మ, 'స్వామీ!' తొందరపడి నిన్ను శపిం చాను. శాపవిముక్తి ఇయ్యలేను కానీ, కొంచెం మార్పు చెయ్యగలను.

ధర్మదేవత కృతయుగంలో నాలుగుపాదాలతోను, త్రేతాయుగంలో మూడుపాదాలతోను, ద్వాపరయుగంలో రెండుపాదాలతోను, కలియుగంలో ఒంటిపాదంతోను సంచరిస్తుంది.

ధర్ముడు ఆమె సౌశీల్యానికి సంతసించి, 'నీ భర్త యువకుడు, సుందరుడు అగుగాక, మీకు అష్టైశ్వర్యాలు కలుగుగాక!' అని వరమిచ్చి అదృశ్యుడయ్యాడు.


ధర్మదేవత ఈ శాప ప్రభావం వల్లనే కలికాలంలో అశక్తురాలైందని అర్థమవుతోంది కదూ!





మహిమల కొండ

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152



అది ప్రాచీనమైన ఒక మహానగరం! చాల రద్దీగా ఉంది. ఆ రోజు మరీను. అందులోను నాలుగుదారుల కూడలి. రణగొణ ధ్వనులు. చాలా వేగంగా వచ్చిపోయే వాహనాలు, తమ వస్తువుల్ని అమ్ముకోవడానికి వచ్చిన వ్యాపారస్థులు, వాటిని కొనడానికి వచ్చిన జనులు, వీళ్లందరితో సందడిగా ఉంది.

ఏ వీథిలో చూచిన ఇదే పరిస్థితి. జనాలు నడవడం లేదు. పరిగెత్తుతున్నట్లుగా ఉంది. ఆడా, మగా, చిన్నా, పెద్దా తేడా లేదు. ఎవరికి వారే అన్నట్లుగా వేగంగా నడుస్తున్నారు. కాదు. కాదు. తీరికే లేనట్లు పరిగెత్తుతున్నారు. ఎందుకోసమో, ఎవరి కోసమో ఆ పరుగులు? ఎవరికి తెలుసు?

ఇంతవేగంగా, రద్దీగా ఉన్న ఆ నగరంలో ఒకచోట విచిత్రమైన ఒక దృశ్యం కంట పడింది.

ఐదుగురు మనుషులు వరుసగా ఒకరి చేతులు ఒకరు పట్టుకొని నడుస్తున్నారు. గట్టిగా అరుస్తున్నారు. ఆ జనసమ్మర్థంలో రణగొణ చప్పుళ్లలో వారి గోడు సరిగా వినపడలేదు. వారి గోల కొంచెం కూడా అర్థం కావడమే లేదు.

ఆ దిక్కుగా వెళ్ళే జనం కొందరు వాళ్లని చూచి విసుక్కుంటున్నారు. కొందరేమో జాలి చూపిస్తున్నారు. కాని, వారికి దూరంగా పోతున్నారు. మరి కొందరు దయగలిగినవాళ్లు వాళ్ల చేతుల్లో చిల్లర డబ్బులు పడవేస్తున్నారు. ఇంకొందరు వాళ్లముఖాల్ని చూడటమే పాపం అనుకొంటూ ముఖం చిట్లించుకొంటూ అసహ్యించుకొంటున్నారు.

ఇంతమందిని అన్ని విధాలుగా ప్రవర్తింపజేసిన వాళ్లెవరు? గొలుసుకట్టుగా చేతుల్ని పట్టుకొని ఆ వ్యక్తులు వీథిలో ఎందుకు అరుస్తూ నడుస్తున్నారు? అంటే...

వాళ్లు ఐదుమంది బిచ్చగాళ్లు! విధి వక్రించి, విధిలేక ఒకరి మీద మరొకరు. ఇలా ఐదుమందీ ఆధారపడి బ్రతుకుతున్న బిచ్చగాళ్లు. కాదు కాదు. దీనాతిదీనంగా బ్రతుకీడుస్తున్న బిచ్చగాళ్లు!

వాళ్లలో ఒకడు పుట్టుకతో మూగవాడు. వాడికి మాటలే రావు. మరొకడు పుట్టుకతో చెవిటివాడు. మూడోవాడు మోచేతుల వరకు మాత్రమే ఉన్న మొండి చేతులవాడు, నాలుగో వాడు పుట్టు గుడ్డి, ఐదోవాడు ఒంటికాలు మాత్రమే ఉన్న కుంటివాడు, ఇదీ వారి పరిస్థితి.

వీళ్లు ఐదుగురూ ఒకరి చేతులు ఒకరు పట్టుకొన్నారు. వీథిలో నడుస్తూ అడుక్కుంటు న్నారు.

కళ్లే లేని కబోదిని బాబూ! అని ఒకడంటే, నడవలేని కుంటివాణ్ణి బాబయ్యా! అని మరొకడంటే "వా.. వా..." అంటూ నోరును కొట్టుకుంటూ నోట మాటరాని మూగవాణ్ణి అంటూ ఆక్రోసిస్తున్నాడు.

ఇలా ఐదు మంది తలోరకంగా ఒకేసారి అరుస్తూ అడుక్కుంటున్నారు. అరుపులతో కూడిన వాళ్ల యాచన ఆ దారిలో వెళ్ళే జనానికి కర్ణకఠోరంగా ఉంది.

సంపదలు కలిగిన సత్పురుషులు గర్వాన్ని పొందరు

కొందరు వాళ్లను జాలిగా చూసుకుంటూ పక్కకు తొలగి పోతున్నారు. కొందరు వాళ్ల అరుపులకు చిరాకుపడుతూ వాళ్లవైపు చూడకుండానే దూరదూరంగా వెళ్తున్నారు. కొందరు పుణ్యాత్ములు అయ్యో! పాపం! అనుకొంటూ తృణమో పణమో వాళ్ల చేతుల్లో వేస్తూ వెళ్ళిపోతున్నారు.

ఇంతలో వాళ్ల దగ్గరికి ఒక పుణ్యాత్ముడు వచ్చాడు. వాళ్ల చేతుల్లో కొంత పైకాన్ని వేస్తూ ఇలా అన్నాడు.

"ఒరే నాయనలారా! మీ జీవితాలు ఎప్పటికి తెమిలేను? మీ మీ సమస్యలు ఏనాటికి తీరేను? అనవసరంగా కర్ణకఠోరంగా గొంతులు చించుకొని అరుస్తున్నారు. హృదయవిదారకంగా ఉంది మీ పరిస్థితి. నేనొక మాట చెప్తా, వింటారా? జాగ్రత్తగా విని నా మాటను ఆచరించండి. తప్పక మీకు ఒక పరిష్కారం దొరకొచ్చు. మీ మీ జీవితాలు ఏ మాత్రం అనుమానం లేకుండా కుదుట పడతాయి తెలిసిందా?".

"అయ్యో! దరమ ప్రబువులు. సల్లంగ ఉండాల, మీరు సెప్పినట్టు సేత్తం. తొందరగా జెప్పండ్రి. మా పాణాల్ని కాపాడండి. మా జీవితాల్ని ఒడ్డు కీడ్చండి. మారాజా!" అంటూ చేతులెత్తి దండం పెడుతూ ప్రాధేయపడ్డారు.

"ఒరే! నాయనలారా! వెంటనే జనారణ్యం అయిన ఈ మహానగరాన్ని విడిచి దూరంగా వెళ్లండి. **ఇక్కడి నుంచి ఉత్తరం దిక్కునకు ప్రయాణం చెయ్యండి. అటు వైపున కొంతదూరం నడిస్తే, అద్భుతమైన మహిమలు ఉన్న ఒక కొండ చాల దూరాన్నుంచే మీకు కనిపిస్తుంది. కనపడిన వెంటనే ఆ కొండకు చేతులెత్తి దండం పెట్టుకోండి! ఆ కొండవైపు అడుగులు వెయ్యండి! ఇంక ఆలస్యం చెయ్యకండి. మీ మీ బతుకుల్ని బాగుపరచుకోండి. పోయిరాండి"- అంటూ మరికొంత చిల్లర డబ్బులు వాళ్లచేతుల్లో కుమ్మరించాడు.**

వాళ్లు కృతజ్ఞతతో నిండిన చూపుల్తో ఆ పెద్దమనిషికి చేతులెత్తి దండం పెడుతూ ఆ నగరాన్ని విడిచి ఉత్తరం దిక్కుకు నడక సాగిస్తూ కొంతదూరం వెళ్లారు.

విచిత్రాతి విచిత్రం!

వాళ్లకు ఆ మహిమలకొండ చాలా దూరాన్నుంచే కన బడింది. ఆనందంతో చేతులెత్తి దండం పెట్టారు. అక్కడి నుంచి ఆ కొండవైపు పట్టుమని పది అడుగులు వేశారు. అంతే!

ఆ కొండమీది చల్లని గాలి వీళ్లమీదికి వీచింది. ఇంకే ముంది! పుట్టుమూగవాడికి మాట వచ్చింది. రావడమే కాదు. స్పష్టంగా శ్రీవేంకటేశుని మీద శ్లోకాన్ని చక్కగా చెబుతూ ఉన్నాడు. ఆ శ్లోకాన్ని పుట్టుచెవిటివాడు వింటూ ఆహా! అద్భుతం అంటు న్నాడు. ఇక ఆ శ్లోకాన్ని మొండి చేతులవాడు శ్రద్ధగా ముత్యాల మాదిరిగా గుండ్రంగా రాస్తూ ఉండగా, పుట్టుగుడ్డివాడు, దాన్ని చూస్తూ అద్భుతం, ఎంత బాగా రాస్తున్నావయ్యా అంటున్నాడు. ఇంతలో కుంటివాడికి కాళ్లు వచ్చి, అవలీలగా ఆ మహిమల కొండవైపు పరిగెత్తాడట ఎక్కడానికి.

ఇలా మహిమల కొండమీది గాలి సోకంగానే బాగుపడ్డ ఐదుమంది ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆ కొండను ఎక్కడానికి ప్రారంభించారు.

ఇంతలో అక్కడి ఒక యువతి సంకలో చంటిబిడ్డతో వచ్చింది. 'ఎవరమ్మా? ఎక్కడి నుంచి వచ్చావమ్మా' అని వాళ్లు అడిగారు.

"అన్నలారా! నేను పుట్టు వంధ్యను, అంటే ఈ జన్మలో ఇక పిల్లలే పుట్టరని వైద్యులు తేల్చి చెప్పిన పుట్టు గొడ్రాలిని. కాని, ఒక పుణ్యాత్ముడు నాకు చెప్పాడు. బాధ పడవద్దు. అక్కడ ఒక మహిమల కొండ ఉంది. ఆ కొండపైన కోరిన వారికి కోరినట్లుగా వరాలనిచ్చే కొండంతటి దేవుడు ఉన్నాడు. నీకు సంతానాన్ని ప్రసా దిస్తాడు. బిడ్డతో కొండకు వస్తానని మొక్కుకొమ్మన్నాడు. అంతే! నా వంధ్యాత్వం పోగొట్టిన ఆ స్వామికి, ఇదిగో నా బిడ్డను ఎప్పుడె ప్పుడా చూపించేది అని పరుగులు పెడుతూ వస్తున్నాను" అని చెప్పింది.

పరస్పరం ఆ కొండ మహిమలను విని, ఆశ్చర్యంతో ఇక కొండమీది దేవుడు ఇంకెంతో గొప్ప మహిమలను కలిగి ఉన్నాడో కదా! వెంటనే దర్శించాలన్న ఆత్రుతతో గోవిందా...! గోవిందా.....!! అంటూ అందరూ తిరుమల కొండను ఎక్కడం ప్రారంభించారు.

ఇలాంటి 'తిరుమలకొండ' మహిమలను, శ్రీవేంకటేశ్వ రుని లీలలు తెలియజేసే యథార్థమైన ఈ దివ్యగాథను 16 వ శతాబ్దంలో దక్షిణ దేశాన ఉండిన **"వేంకటాధ్వరి"** అనే మహాకవి తన శ్లోకంలో ఇలా అక్షర నిక్షిప్తం చేశాడు.

శ్లో॥ మూకారబ్ధం కమపి బధిరాః శ్లోక మాకర్ణయంతి,
శ్రద్ధాకుస్తం, విలిఖతి కుణి, శ్లాఘయా వీక్షతేంధః
అధ్యారోహత్యహహా! సహసా పంగు రప్యద్రి శృంగం
సాంద్రాలస్యా శిశుభరణతో మంద మాయాతి వంధ్యా.
- వేంకటాధ్వరి (విశ్వగుణాదర్శం - చంపూకావ్యం)

ఓం నమో వేంకటేశాయ

యువవాణి

జ్ఞానం నుంచి ఉన్నత జ్ఞానానికి

- శ్రీ వాగ్దేవు చినవీరభద్రుడు

'నేటి ప్రపంచం తరచూ హింసతో కూడుకున్న ప్రపంచంగా మారిపోతుంది. తద్వారా అది మానవప్రగతిని విశ్వసిస్తున్నవాళ్ల నమ్మకాలను వమ్ముచేస్తోంది... సమాజంలో సంఘర్షణల్ని తొలగించే విద్య లేదా మనుషులు తోటివారి పట్లా, వారి సంస్కృతుల పట్లా, వారి ఆధ్యాత్మికవిలువల పట్లా గౌరవాన్ని పెంచుకొని తమ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోగలిగే విద్య. అటువంటి విద్యావిధానాన్ని రూపొందించడం సాధ్యమేనా? అనేదాన్ని ఈ రోజు మనం తెలుసుకుంటున్నాం.

(గతసంచిక తరువాయి భాగం...)

ఇక అన్నిటికన్నా ముఖ్యమైన వాక్యాలు సంపాదకుడిప్పుడు చెప్తున్నాడు

'మనమిప్పుడు ఉన్నతవిద్యసంగతి చూద్దాం. నేను భూగోళ శాస్త్రం, ఖగోళశాస్త్రం, బీజగణితం, రేఖాగణితం మొదలైనవెన్నో నేర్చుకున్నాను. అయితే ఏమిటి? దానివల్ల నేను నన్ను గానీ, నా చుట్టూ ఉన్న వాళ్లను గానీ ఏమేరకు బాగుపరుచుకోగలిగాను? ఇంతకీ నేనివి ఎందుకు నేర్చుకున్నట్టు?...నేను చెప్పిన ఈ చదువులేవీ కూడా నా ఇంద్రియాలను అదుపుచేయటానికి ఎంత మాత్రం ఉపయోగించలేదని స్పష్టంగా చెప్పదలచుకున్నాను. కాబట్టి ప్రాథమికవిద్య కానివ్వండి. ఉన్నతవిద్య కానివ్వండి. అది మన ప్రధానవిషయానికి ఎంతమాత్రం పనికొచ్చేదికాదు. అది మనని మనుషులుగా రూపొందించదు. మన విధ్యుక్తధర్మం నిర్వహించ డానికది మనల్ని ప్రోత్సహించదు'.

'హింద్‌స్వరాజ్'లోని పై సంభాషణను సుదీర్ఘంగా ఉల్లేఖించ డానికి కారణం అది భారతదేశంలో ఉపనిషత్తుల ఆలోచనా పరంపర తరంనుంచి తరానికీ, యుగంనుంచి యుగానికి ఎలా కొనసాగుతూ ఉందో చూపించడానికి మాత్రమే. ఛాందోగ్యోప నిషత్తులో ఇటువంటిసంభాషణే ఉందని గాంధీజీకి తెలియాల్సిన అవసరం లేదు. ప్రతియుగసంధిలోనూ జిజ్ఞాసాపరుడైన మానవుడు ఈ దేశంలో ఇటువంటిమాటలే మాట్లాడుతున్నాడు.

ఈ వాక్యాలు పైపైన చదివి మనం గాంధీజీ సార్వజనీన విద్యను నిరసిస్తున్నాడనుకోవడం పొరపాటే అవుతుంది. ఆయన చెప్తున్నదంతా ఈ విద్య ఇప్పుడున్న రూపంలో శుష్కవిద్యమాత్రమే నని. దీనికొక మానవీయ పార్శ్వం జతకాకపోతే, తోటిమనిషి కోసం, ఆ మాటకొస్తే, చరాచరాలన్నిటికోసం ఆవేదన చెందే గుణమే లేకపోతే ఈ విద్య మనిషికీ, సమాజానికీకూడా ఏమాత్రం పనికిరాదనే ఆయన చెప్తున్నాడు.


ఇరవయ్యోశతాబ్దప్రారంభంలో గాంధీజీ ఇట్లా మాట్లాడితే ఇరవైఒకటో శతాబ్ద ప్రారంభంలో విద్యావేత్తలుకూడా ఇదే మాట మాట్లాడుతున్నారు. ఇరవైఒకటో శతాబ్దంలో విద్య తీరుతెన్ను లెలా ఉండాలో నిర్వచించమని యునెస్కో ఒక అంతర్జాతీయ కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ ఈ విషయాన్ని కూలం కషంగా అధ్యయనం చేసి 'లెర్నింగ్ : ద ట్రెజర్ విదిన్' (1996) పేరిట నివేదిక సమర్పించింది. అందులో నవీనవిద్యకు నాలుగు ఆధారస్తంభాల్ని పేర్కొంది. ముఖ్యంగా 'కలిసి మెలిసి జీవించడం'. 'ఇతరులతో కలిసి జీవించడమె'లానో నేర్చుకోవటమే అన్నిటికన్నా అవసరమైన సామర్థ్యంగా ఆ నివేదిక పేర్కొంది. ఆ నివేదిక ఇలా అంటోంది :

ఈ ప్రసంగానికి వచ్చేముందు ప్రపంచంనేటి విద్యావిధానం గురించి ఏమనుకుంటోందో చూద్దామని ఒకసారి ఇంటర్నెట్ తిరగే శాను. అందులో www.shiftingthinking.org అనే ఒక సైటు నన్ను చాలా ఆకర్షించింది. అందులో ఇంతదాకా సాగిన విద్యకీ, రానున్న కాలాల్లో అవసరమైన విద్యకీ మధ్య తేడా గుర్తించే ప్రయత్నం కనిపించింది. ఇంతదాకా సాగిన విద్య ప్రధానంగా వ్యావసాయిక, పారిశ్రామికయుగాలకు అవసరమైన విద్యకు సంబంధించినవ్యవస్థ అనీ, అది ప్రధానంగా know what అనే దాన్ని గురించే ఆలోచిస్తుందనీ ఆ వెబ్‌సైట్ వివరించింది. పారి శ్రామికసమాజంలో విద్యనొక భౌతిక వనరుగా, ఒక పదార్థంగా మాత్రమే చూడటం జరిగిందనికూడా అందులో పేర్కొన్నారు. కాని రానున్న యుగం జ్ఞానయుగమని ఈ యుగంలో విద్య గత యుగాలకన్నా భిన్నంగా ఉంటుందనీ, ఉండాలనీ ఆ వెబ్‌సైట్ వాదించింది.

దాని ప్రకారం రాబోయే కాలంలో విద్య know what కాదనీ, అది know how కావాలని కూడా అంది. పారి శ్రామికయుగంలో విద్యపదార్థంగా భావించబడితే రానున్న కాలాల్లో

విద్య అభ్యాసాన్ని బట్టి, బుద్ధి కర్మను బట్టి ఉంటుంది

విద్య శక్తి రూపంగా గుర్తించబడాలని కూడా ఆ వెబ్‌సైట్ భావించింది. విద్యను మనం ఒక పదార్థంగా భావించినప్పుడు దాన్ని మూటకట్టగలమనీ, దాచగలమనీ, అమ్మగలమనీ, కొనగలమనీ అనుకుంటాం. కాని దాన్ని శక్తిగా భావిస్తే అటువంటిదేదీ సాధ్యంకాదు. అప్పుడు మనం విద్యను పెంపొందించు కోవటమెలా అనే ఆలోచించాల్సి ఉంటుంది. ఆశ్చర్యమనిపించిందేమంటే, వేలయేళ్లకిందటి ఒక ఉపనిషత్తు మాట్లాడిన వాక్యాలనే ఈ రోజు ఈ వెబ్‌సైట్‌కూడా మాట్లాడుతుండటం.



మనుషుల్ని రూపొందించే విద్య

వేదవేదాంగాలు బోధిస్తున్నవిద్య సాధారణవిద్య మాత్రమేననీ, ఆత్మజ్ఞానాన్ని కలిగించేవిద్య అమృతత్వాన్ని సాధించేవిద్య అంతకన్నా ఉన్నతమైనవిద్య అని అంగిరసుడు భావిస్తే, ఆధునిక విజ్ఞానం బోధిస్తున్నవిద్య మనుషుల్ని రూపొందించే విద్యగా మారటంలేదని మహాత్మాగాంధీ భావిస్తున్నాడు. రాబోయే కాలాల్లో విద్య శక్తిస్వరూపంగా మారాలని ఆకాంక్షిస్తున్న విద్యావేత్తలుకూడా ఈ మాటలే చెప్తున్నారు. అత్యాధునిక కమ్యునికేషన్ టెక్నాలజికూడా మనుషుల్ని ఒకరితో ఒకర్ని యాంత్రికంగా కలపగలదే తప్ప, ఆత్మికంగా కలపలేదని ఒక వెబ్‌సైట్ వాపోతున్నది. 'గూగుల్', 'ట్విట్టర్', 'స్కైప్'ల ద్వారా నిజమైన మనుషులు రూపొందగలరా? అని ఆ వెబ్‌సైట్ ప్రశ్నిస్తున్నది.

నీ గురించీ, నా గురించీ తోటిమనుషులసమాజం గురించీ వివరాలు తెలుసుకోవడం విద్యాసముపార్జనలో ఒక భాగం. అది సగభాగంమాత్రమే. దాన్నే ఈశావాస్యం 'అవిద్య' అనీ, ఛాందోగ్యం 'మంత్రవిద్య' అనీ, ముండకం 'అపరవిద్య' అనీ, గాంధీజీ 'అక్షరజ్ఞాన'మనీ పేర్కొన్నారు. నిజమైన విద్య ఆ తరువాతే మొదలౌతుంది. అది నిన్ను నీ తోటిమనిషితో మానసికంగా, ఆత్మికంగా అనుసంధానం చేయవలసి ఉంటుంది. దాన్నే ఈశావాస్యం 'అమృతవిద్య' అంది. ఛాందోగ్యం 'ఆత్మవిద్య' అంది. ముండకం 'పరావిద్య' అంది. అంతేకాదు తక్కిందంతా అవృతమనీ అది నిలవదనీ, కేవలం సత్యంమాత్రమే నిలుస్తుందనీ, జయిస్తుందనీ అంది.

'నేటి ప్రపంచం తరచూ హింసతో కూడుకున్న ప్రపంచంగా మారిపోతుంది. తద్వారా అది మానవప్రగతిని విశ్వసిస్తున్నవాళ్ల నమ్మకాలను వమ్ముచేస్తోంది... సమాజంలో సంఘర్షణల్ని తొలగించే విద్య లేదా మనుషులు తోటివారిపట్లా, వారి సంస్కృతుల పట్లా, వారి ఆధ్యాత్మికవిలువల పట్లా గౌరవాన్ని పెంచుకొని తమ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోగలిగే విద్య. అటువంటి విద్యావిధానాన్ని రూపొందించడం సాధ్యమేనా?... ఇందుకుగాను విద్య రెండురకాల మార్గాలెంచుకోవలసి ఉంటుంది. ఒక స్థాయిలో, అది విద్యార్థి తనతోపాటు తోటిమనుషులుకూడా ఈ ప్రపంచంలో జీవిస్తున్నారని నెమ్మదిగా తెలుసుకుంటూరావటం. మరొకస్థాయిలో, జీవితం పొడుగుతా తోటివారితో కలిసి ఉమ్మడి ధ్యేయాల్నీ, ఉమ్మడిప్రయత్నాల్నీ పంచుకుంటూండటం.'

ఆత్మజ్ఞానం నిజమైన జ్ఞానం

ఈ నేపథ్యంలో మనం ముండకోపనిషత్తును, ఆ మాటకొస్తే, ఏ ఉపనిషత్తునైనా పునరధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రపంచం గురించి తెలుసుకునే జ్ఞానాన్ని ఉపనిషత్తు 'విజ్ఞాన'మంది. చరాచరాలన్నిటిలోనూ ఉన్నదొకటే సత్యమని తెలుసుకునే జ్ఞానాన్ని 'ప్రజ్ఞాన'మంది. ఆధునికయుగం ప్రధానంగా సైన్సుమీద, హేతువుమీదా ఆధారపడ్డది. ఇది వైజ్ఞానికయుగం. ఇది సాంకేతిక పరిజ్ఞానం ప్రధానంగా ఉండే యుగం. అయితే కేవలసాంకేతికపరిజ్ఞానం నిజమైన మనిషిని రూపొందించగలదా?

ఉపనిషత్తుల్లో నాలుగు మహావాక్యాలున్నాయంటారు. కానీ ముండకోపనిషత్తులోని **'సత్యమేవ జయతే, న అనృతమ్'** అనే ఈ వాక్యం అన్నిటికన్నామించిన మహావాక్యమనీ నేటి మన సమాజ విముక్తికి అత్యంతఅవసరమైన మహావాక్యమనీ అనుకోవచ్చు.

మార్చి 24న అన్నమయ్య వర్ధంతి సందర్భంగా...

అన్నమయ్య సంకీర్తనల్లో... మనోభావ సూక్తులు

- డా॥ యం.మాదన్న

భక్తి అనే అమృతసాగరంలో సునిశితంగా పరిశీలించినట్లయితే ఎందరో భక్తులు మనకు సాక్షాత్కరిస్తారు. అకుంఠితదీక్ష, కఠోర శ్రమ, ఎన్నో విషమ పరిస్థితులు, పరీక్షలు, వైరాగ్యం, తాత్త్వికత ఈ భక్తుల ద్వారా అవగతమవుతాయి. అందులోను ఇక వాగ్గేయకారుల స్థితిగతులను గమనించినట్లయితే పైన ప్రస్తావించిన అంశాలకు మినహాయింపుకాదు. భక్తులు, వాగ్గేయకారులు, దేశసంచారులు, సామాజిక పరిశీలకులు, "వజ్రానికి సానబెడితే వన్నె చేకూరుతుందనే" సామెత ఉపమానానికి అందని హృదయ విదారకమైన సంఘటనల్ని దర్శించి ఉంటారు, ఎదుర్కొని కూడా ఉంటారు.

"జన్తూనాం నరజన్మదుర్లభం" అంటారు. ఆ లభించిన జన్మను సార్థకం చేసుకోవడమే మానవజన్మకు సార్థకత – అలా సార్థక జన్ములైనవారిలో అన్నమయ్య ఒకరు. ఎన్నో ఉలిదెబ్బలకు తట్టుకున్నరాయి అందమైన శిల్పంగా తయారయి ఆకర్షింప బడుతుంది. అన్నమయ్య జీవితం కూడా అలాంటి కోవలోనిదే! మనిషి ఎదిగినా, ఒదిగినా, గెలిచినా, ఓడినా, కష్టించినా, సుఖించినా, చెప్పకుంటూ పోతే ఇలా ఎన్నో. అన్నిటికి కారణం మనస్సే, "నమ్మితే నీ మనసే నీకు దైవం నమ్మక పోతే అదే నీకు దెయ్యం" కాబట్టి మనసుకు సంబంధించినంతవరకు అది చాలా సుకుమారం. పొగిడితే సంతోషిస్తుంది. తెగిడితే ఘోషిస్తుంది. మనసు లేనిదే మనిషి లేడు. మనస్సును స్వాధీనంలో పెట్టుకొని కర్తవ్యం నెరవేర్చితే మనిషి ఎంత ఎత్తుకైన ఎదగగలడు. మనసుకు పూర్తిగా లోబడితే స్వాధీనం తప్పి ఎంతటి క్రిందికైనా దిగజారిపోతాడు. మనసన్నది ఎవరికీ కనబడనిది, అర్థమయ్యి కానిది.



బ్రతుకన్నది నాటకము. ఆ నాటకమాడించేది మనసు. దీనిని కూడా అన్నమయ్య "నానాటి బ్రతుకు నాటకము" అని తన సంకీర్తనలో పొందుపరిచాడు. ప్రతి మనిషి జీవితము ఒక నాటకము. అందులో వారివారి పాత్రలు అనేక రకాలుగా నిక్షిప్తమై ఉంటాయి.

అందుకే విజ్ఞులు కథల ద్వారా, గేయాల ద్వారా, పద్యాల ద్వారా, శ్లోకాల ద్వారా ప్రతి అంశంలోను ఏదో ఒక పరమార్థాన్ని సూచించే విధంగా ప్రాచీనం నుంచి ఆధునికం వరకు నిరంతరం ఈ సూక్తుల ప్రవాహం కొన సాగిస్తూనే ఉన్నారు.

మనిషి జీవితాన్ని మలుపు తిప్పేవి ఎక్కువగా సూక్తులే! చెప్పేవారు, రాసేవారు తమ అనుభవపూర్వకమైన వాస్తవిక జీవిత సత్యాలే. అవి ప్రతి మనిషికి అవసరం. అనివార్యం. అన్నమయ్య లిఖించిన మనస్సంబంధ సూక్తులు ఎలాంటివో గ్రహిద్దాం.

కోరికలనే గుర్రాలు మనసును గాడి తప్పేటట్లు చేస్తాయి. దానిని అదుపు చేయకపోతే, ఇష్టానుసారంగా వదిలిపడితే ఎంత దూరమైనా కొలతలు లేకుండా అంతు చిక్కకుండా వెళుతుందని క్రింది సూక్తి ద్వారా గ్రహించ వచ్చు.

ఇట్టె వదిలితేను యెందైనాఁ బారు మనసు - (2-24)

తీవ్రమైన కోపంగా మనసున్నప్పుడు ఊరికే ఉండ నీదు. అది అటూ ఇటూ ఏదో ఒకటి చేసే వరకు ఒకచోట ఉండనీదు అంటాడు. ఇది దీర్ఘకాల వైరమున్నవారి స్వభావా నికి సంబంధించినది.

ఉడికిని చిత్తంబూఁ కోననోపదు - (26-37)

మాటలనేవి ఎదుటివారిని ఆనందింపజేసేవి, పరవశింపజేసేవిగా ఉండాలని మాటాడితే అలా మాట్లాడాలని అంటారు. ఎదుటివారిని నొప్పించేటట్లు కాకుండా, తానూ బాధపడేటట్లు కాకుండా మాట్లాడాలి.

మనసు రంజిల్లఁగ మాటాడుట మేలు - (30-338)

హృదయాలు కరిగి చేతికి వశమైనట్లు వశమై మాట్లాడే కులుకుల పూర్వకమైన మాటలే సంపదలను మించిన సుఖమని క్రింది సూక్తి పేర్కొంటోంది.

కరిగిన మనసులై కైవశములయితేను
సిరులు మించిన యట్టి చెనకులే సుఖము - (27-66)

'జేరి మూర్ఖుల మనసు రంజింపరాదు' అన్నట్లుగా కలుపుగోలుతనం లేని వారు, దుర్మార్గులు, వీరు ఎన్నటికీ కలవరు. కలవాలనే ఆశకూడా ఉండదు. కాబట్టి అటువంటి పగబట్టిన మనసు పోటుకంటే ఆలోచనలో కలిగే అడియాస, చీకటే మేలు. ఎందుకంటే ఇవి ప్రకృతిపరమైనవి. కలిసీ కలవని మనసు కపటంతో కూడినదని అర్థం చెపుతున్నది దిగువసూక్తి.

కలసీ కలియని మనసు కసిగాటు కంటేను
తలఁపులో నడియస తమకమే మేలు - (30-83)

పాపిష్టి ఆలోచనలు మదిలో విస్తరించకుండా అడ్డ కట్ట వేస్తే తాను చేసిన దానాలనుబట్టి మంచి ఫలితాలుం టాయి అంటోంది క్రింది సూక్తి.

పాపచింత మదిలోనఁ బారకుండా నిలిపితే
చేపట్టి దానము లెల్లాఁ జేసినంత ఫలము - (1-430)

అసూయంటే ఏమిటో ఎరుగని వాడు ఆజాను బాహుడు. ఆయనే శ్రీరాముడు. వాల్మీకి విరచితమైన ఆది కావ్యము రామాయణం. అది ఒక కుటుంబ కథ. రాజ కుటుంబంలో జన్మించిన రాజు ప్రజాశ్రేయస్సే పరమావధిగా దేనినైనా తృణప్రాయంగా భావించే విధంగా ఉండి రాజ్య పాలన చేసేవాడు. నేటి పరిస్థితుల్లో వారసత్వాలు, కుటుం బాలు రాజపాలనలో భాగమయ్యాయి. సాక్షాత్తు ఇతిహాస కథానాయకుడికే మానసిక క్షోభ సంభవించినా ప్రజాహితమే కాంక్షించాడు. ప్రజావసరాలనే గుర్తించి తీర్చాడు. కారణం మనస్సే.

మచ్చరము లేకున్నను మనసే రామరాజ్యము - (2-362)

పుణ్యంకొద్ది పురుషుడు–దానం కొద్ది బిడ్డ, పిండి కొద్ది రొట్టె ఈ సామెతలకు నిలువెత్తు నిదర్శనం మనిషి

మనసు. వారివారి ఆలోచనలను బట్టివారికి శుభములు కలుగుతాయి అన్న అర్థాన్ని స్ఫురింపజేస్తోంది ఈ సూక్తి.

మనసు కొలదియే మంగళము - (27-369)

దేవుడికి ప్రతిరూపం మానవుడు. మానవసేవే మాధవ సేవ. ఈ సేవాభాగ్యం మనసు చెబితేనే మనిషి చేస్తాడు. అప్పుడు దేవుడుగాని, దేవతగాని అవుతారు.

ఉదాహరణకు తల్లిదండ్రులు, సామాజిక సేవకులు, గురువు, వైద్యుడు వీరిని మనసున గట్టిగా విశ్వసిస్తే, దాని నొక అలవాటుగా చేసుకుంటే దైవంగా బాసిల్లుతున్నదని అక్షరసత్యం.

మనసునమ్మ నేర్చితే మనుజుడే దేవుడౌను - (2-352)

మనసును నిలపడం అసాధ్యమే. అంటూనే సాధ్యం చేయాలంటూ పరోక్షంగా హెచ్చరించాడు. కట్టడి చేసు కోవడం ప్రయత్నపూర్వకమే తప్ప మరొకటి కాదన్న పరమార్థాన్ని పేర్కొంటోంది క్రింది సూక్తి.

"మనసు నిలనలవి కాదు" (29-35)



రహస్యాలు పెదవిదాటినా పృథివి దాటును. ఈ రహస్యాలను దాచగలవారు, ప్రచారం చేయగల సమర్థులు స్త్రీలు అని సామెత. మనసులోని అతి గూఢమైన ఆలోచనలు స్త్రీలతో చెబితే దాని పర్యవసానం ఎన్నో రకాలుగా ఉంటుందని క్రింది మాటలో పరోక్షమైన హెచ్చరిక.

మనసు లోపలిమాట మగువ కాడంగరాదు - (25-203)

మాటలు ఎన్నైనా మాట్లాడవచ్చు. ఎముక లేని నాలుక ఏవిధంగానైనా మాట్లాడగలదు. "నోటికి తలుపా ద్వారబంధమా" అనే సామెతలు కూడా ఇందు మూలంగానే పుట్టుకొచ్చాయి. మనసుకు ఇవేవిలేవు. మనసు ద్వారా ఉత్పన్నమయ్యేవే. కాబట్టి ఈ ఆలోచనలు పట్టుకోలేమని అంటాడు.

మాటలాడవచ్చుంగాని మనసులు పట్టరాదు - (2-474)

మనిషి జీవితంలో ఊహింపశక్యం కానిది, వర్ణనా తీతమైనది ఎడబాటు. ఈ ఎడబాటు మనిషి జీవితంలో ఎప్పుడు ఎలా వచ్చి కృంగదీస్తుందో అర్థంకాదు. అందులో ఇష్టమైన విరహమైతే దానిని సుఖంగా అనుభవించగల మనస్వినులు స్త్రీలు.

వినవేరిచినఁజాలు విరహమైనా సుఖమే
మనసు దెలిసినట్లే మగువలకు - (27-22)

దృఢమనస్కుడికి, న్యాయాధీశుడికి, సమభావం గల వాడికి మనసు ఎప్పుడూ ఒకేవిధంగా ఉంటుంది. అంటే మంచిమనసుగల మనిషి మనసు చల్లగా పదిలంగా ఉంటుంది. వేరే విధంగా మారదన్నదానికి తార్కాణంగా –

సమచిత్తునకు చంచలము గాదు - (2-307)

– అని పేర్కొన్నాడు.

ఈ విధంగా అన్నమయ్య సంకీర్తనల్లో గల సూక్తులు కోకొల్లలు. అందునా 'మనోభావ సూక్తులు' సర్వదా స్మరణీయం. ఆచరణీయం, ఆమోదయోగ్యం.

పెద్దల ఆశ్రయం ఉన్నప్పుడు అసమర్థుడు కూడా శోభిస్తాడు

సప్తగిరీశుని సప్తవాహన సౌందర్యం

(03 ఫిబ్రవరి 2017 రథసప్తమి పర్వదినాన జరిగిన)



సూర్యప్రభవాహనం



చిన్నశేషవాహనం



గరుడవాహనం



హనుమంతవాహనం



కల్పవృక్షవాహనం



సర్వభూపాలవాహనం



చంద్రప్రభవాహనం


సనాతన ధార్మిక సదస్సు - 2017
ఆస్థాన మండపము, తిరుమల
తేది: 20-02-2017 సోమవారం









శ్రీవారి ఆస్థానమండపం(తిరుమల)లో ఫిబ్రవరి 20, 2017న జరిగిన
సనాతన హిందూ ధార్మిక సదస్సు - 2017 విహంగవీక్షణ చిత్రం





తిరుమల తిరుపతి దేవస్థానముల అనుబంధ దేవాలయాలలో జరిగిన తెప్పోత్సవ దృశ్యాలు


శ్రీ కోదండరామ స్వామివారు (శ్రీ గోవిందరాజస్వామి ఆలయం) తిరుపతి


శ్రీ విఘ్నేశ్వర స్వామివారు (శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయం) తిరుపతి


శ్రీ పార్థసారథి స్వామివారు (శ్రీ గోవిందరాజస్వామి ఆలయం) తిరుపతి


శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారు (శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయం) తిరుపతి


శ్రీకృష్ణస్వామి, శ్రీ ఆండాళ్ అమ్మవారు (శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయం) తిరుపతి


శ్రీ చంద్రశేఖర స్వామివారు (శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయం) తిరుపతి


శ్రీ గోవిందరాజ స్వామివారు (శ్రీ గోవిందరాజస్వామి ఆలయం) తిరుపతి


శ్రీ కామాక్షి అమ్మవారు (శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయం) తిరుపతి



తరిగొండ నృసింహా! దయాపయోనిధి!

– ఆచార్య కె.జె.కృష్ణమూర్తి, 83740 28457

శ్రీమన్నారాయణుని పది అవతారాల్లో నాల్గవది నృసింహావతారం. బాలభక్తుల్లో ప్రథమగణ్యుడైన ప్రహ్లాదుణ్ణి కాపాడే నిమిత్తమై భవ్యమైన ఆవేశంతో ఆవిర్భవించిన అత్యంత విశిష్టమైన అవతారమిది! దుష్టశిక్షణ, శిష్టభక్త రక్షణ అయిన అనంతరం ఆదిలక్ష్మీదేవి వేంచేసి, ఆయనను చేరటంతో ఆ దేవుడు లక్ష్మీనరసింహుడై, భక్తజనులకు అభీష్టవరాలను అనుగ్రహించే భక్తవత్సలుడై విలసిల్లినాడు!

కృతయుగంలో ఆ అద్భుతకార్యం సంభవించిన నాటి నుండీ లక్ష్మీనృసింహదేవుణ్ణి అమిత భక్తి ప్రపత్తులతో ఆరాధించటం లోకంలో నిత్య నూతనంగా కొనసాగుతూనే ఉంది.

ఆ విధంగా లక్ష్మీనృసింహుడు అర్చింపబడుతూ ఉన్న అనేక పుణ్యక్షేత్రాల్లో 'తరిగొండ' ప్రముఖమైనదిగా పేర్కొనదగి ఉంది. 'పేరులోనే పెన్నిధి ఉన్నది'– అన్నట్లు ఆ నామధేయంలోనే ఒక విశేషం నెలకొని ఉంది! "తరి కుండ"– అంటే 'పెరుగు తరచే (చిలికే) కుండ' – అని అర్థం. నృసింహదేవుడు పూర్వం అక్కడ పెరుగు చిలుకుతున్న కుండలో సాలగ్రామ(పుట్టుశిల) రూపంలో ఆవిర్భవించినాడు. అందువల్ల, ఆ ప్రదేశంలో పెంపొందిన గ్రామం పేరు 'తరికొండ'– అయినది. ఆ పేరు రానురాను వాడుకలో 'తరిగొండ'గా మారింది.

శ్రీలక్ష్మీనృసింహక్షేత్రమైన తరిగొండ గ్రామం కలియుగ వైకుంఠమైన తిరుమలకు వాయవ్యంగా 108 కి.మీ. దూరాన వాయల్పాడు సమీపంలో ఉంది.

క్రీ.శ.18వ శతాబ్ది ప్రారంభంలో ఆ గ్రామంలో నివసిస్తూ ఉండిన ఉత్తమ గృహస్థు కానాల కృష్ణయామాత్యుడు. అనుకూలవతియైన మంగమాంబ ఆయన ధర్మపత్ని. ఆ పుణ్య దంపతులు సంతానార్థులై తిరుమలకు వెళ్లి, వేంకటరమణున్ని సందర్శించి మనసార మ్రొక్కుకొని వచ్చారు.

దైవభక్తి, సదాచార సంపత్తిగల ఆ దంపతులకు కొన్నాళ్లకు నృసింహజయంతి పర్వదినాన ఆడుబిడ్డ జన్మించింది. వేంకటేశ్వరుని వరప్రసాదంగా కల్గినందున, వాళ్లు ఆ బిడ్డకు 'వెంగమాంబ' అని నామకరణం కావించినారు.



మార్చి, 05 నుండి 13 వరకు తరిగొండ లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా..



తరిగొండకు మరలి వచ్చిన నాటి నుండి వెంగమాంబ లక్ష్మీనృసింహస్వామివారి గుడిలో ఎడమ వైపున ఉన్న నిలువెత్తు ఆంజనేయ విగ్రహం దాపున కూర్చొని, నృసింహ మంత్రాన్ని జపిస్తూ, యోగసాధన చేస్తూ ఉండింది.

ఒకనాడు మధ్యాహ్నవేళలో యోగసాధన చాలించి, అర మోడ్చిన కన్నులతో శూన్యంలోకి చూస్తూ ఉండగా, ఎన్నో కొన్ని లక్షణాలు మిరుమిట్లు గొల్పుతూ, బంతులు బంతులుగా దిగివచ్చి, తన ముఖంలో ప్రవేశించినట్లు విచిత్రమైన అనుభూతిని పొందింది! ఆ క్షణంలో ఆమెకు ఒక వినూత్న శక్తి తనను ఆవేశించినట్లుగా తోచింది!


శ్రీనివాసుని అనుగ్రహం వల్ల అవతరించిన వెంగమాంబకు దైవభక్తి బాల్యంలోనే సహజంగా అల వడింది.

తరిగొండ నృసింహునకూ, తిరుపతి వేంకటేశ్వరు నకూ సంబంధించినవైన – ఆ బాలిక ఆటపాటలు తల్లి దండ్రులకు తొలుత సంతోషదాయకంగా ఉండేవి. తల్లివెంట, తండ్రి వెంబడి లక్ష్మీనృసింహుని దేవా లయానికి రాకపోకలు కావిస్తూ ఉన్నందున, ఇలవేల్పగు ఆ స్వామి యందు వెంగమాంబికకు నిశ్చలమైన భక్తిగురి కుదిరింది.

రూపాంతరం సుబ్రహ్మణ్యదేశికుడు – అనే రాజయోగి సన్నిధిలో బ్రహ్మవిద్యను, అష్టాంగయోగ పద్ధతిని, నారసింహ మంత్ర రాజాన్ని ఉపదేశపూర్వకంగా స్వీకరించింది!

లక్ష్మీనృసింహస్వామివారి అనుగ్రహంవల్ల చదువుల తల్లి సరస్వతి అక్షరాల రూపంలో ఆమె నోట ప్రవేశించిన

ప్రతిరోజూ తిరుమల
శ్రీ వేంకటేశ్వర స్వామివారికి
ఏకాంతసేవ జరిగిన
తర్వాత వేంగమాంబగారు
ముత్యాలహారతి ఇచ్చేవారు.
ఇప్పటికీ తిరుమలలో
ఆమె పేరు మీద ముత్యాలహారతి
ఇస్తుంటారు.



బలవంతుడి తోడి విరోధం చేటుకు కారణం

దని, గురువర్యుడు ఆ వింత సన్నివేశాన్ని గూర్చి విశదీకరించాడు. 'గ్రంథరచనల ద్వారా భగవంతుణ్ణి అరాధించవలెనని ఈ సన్నివేశం సూచిస్తూ ఉన్నది కనుక, వెంటనే రచనకు ఉపక్రమించు!' – అని సుబ్రహ్మణ్య దేశికుడు శిష్యురాలిని ప్రోత్సహించి పంపినాడు.



ఓనమాలు నేర్వకపోయినా, ఛందస్సు (పద్యాల లక్షణం) తెలియకపోయినా, తరిగొండ లక్ష్మీనృసింహ స్వామి వారి దివ్యానుగ్రహము, గురువర్యుల ఆశీస్సులు, యోగవిద్యా పాటవము, ఇంటియందలి సాహిత్య వాతావరణము– ఇవన్నీ తనకు తోడుకాగా, వెంగమాంబ ఒకానొక సుముహూర్తంలో కవితా రచనకు శ్రీకారం చుట్టింది. "తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" – అనే సంబోధన గల 'తరిగొండ నృసింహ శతకం' ఈ కవయిత్రి మొట్ట మొదటి రచన.

'తిరుపతి వేంకటాచలపతియే నా పతి' అనే అచంచలమైన విశ్వాసంతో సువాసినిగా ఉంటూ ఉన్న వెంగమాంబ నిత్యజీవితంలో ఎన్నో ఇక్కట్టులను, ఇబ్బందులను ఎదుర్కొనవలసి వచ్చింది. వాటినన్నింటిని సమర్థవంతంగా అధిగమించటంలో తరిగొండ లక్ష్మీనృసింహుని భక్తి మహిమయే ఆమెకు తోడునీడయై నిలిచి, విజయపరంపరను సమ కూర్చింది!

వెంగమాంబ 'నృసింహ విలాస కథ'– అనే యక్షగానాన్ని రచించి, ఇలవేల్పైన ఆ లక్ష్మీ నృసింహదేవునకే అంకితం కావించింది! శివనాటకము (యక్షగానం)– అనే మఱి మూడు రచనలను వెంగమాంబా కవయిత్రి తరిగొండలో ఉండగా రచించారు.

ఆంజనేయ విగ్రహం వెనుక యోగసమాధిలో ఉన్న వెంగ మాంబను ఒకనాడు గుడిపూజారి గమనించాడు. స్వామివారి సన్నిధి అపవిత్రమైపోయిందనే అపోహతో ఆ పూజారి వెంగమాంబను ఈవలకు లాగినాడు! ఆ సంఘటనను తరిగొండ లక్ష్మీనృసింహుని ఆదేశంగా భావించి, వెంగమాంబ పిన్నప్రాయంలోనే అడవిదారుల గుండా తిరుమల క్షేత్రాన్ని చేరుకొన్నది!

జగన్మాత అలమేలుమంగమ్మ ప్రేరణతో వెంగమాంబ మళ్లీ గ్రంథరచన ప్రారంభించింది. గ్రంథరచనతో పాటు, తిరుమలనాథునకు సమర్పించే నిమిత్తమై తులసీ సుమమాలికల కైంకర్యాన్ని సైతం ఆరం భించింది. విష్ణుపారిజాతము (యక్షగానం) మొదలుకొని వాసిష్ఠ రామా యణము (ద్విపదకావ్యం) వరకు గల పన్నెండు గ్రంథాలను వెంగ మాంబా కవయిత్రి వేంకటేశ్వరుని సన్నిధిలో వెలయించింది.

ఆదివరాహ స్వామి కాటేజీల వద్ద వెనుకగా చిన్న రోడ్డు ఉంటుంది. ఆ రోడ్డులో వెడితే తరిగొండ వేంగమాంబ జూనియర్ కాలేజి అని స్కూలు కనపడుతుంది. అక్కడ ఉంటుంది ఆమె సమాధి. సమాధిదర్శనం చేస్తామని అడిగితే లోపలకు పంపిస్తారు. ఆ సమాధికి సాష్టాంగ నమస్కారం చేసి మౌనంగా ఒక్క నిమిషం కూర్చుని రావాలి. ఇప్పటికీ ఆమె వేంకటేశ్వరస్వామికి అర్చన చేస్తారని చెపుతారు.

ఇలవేల్పైన తరిగొండ లక్ష్మీనృసింహు నకు, ఇష్టదైవమైన తిరుపతి వేంకటరమణునకు సమన్వయ పూర్వకమైన అభేదభావనను తన రచనలన్నింటిలో అపూర్వంగా, అద్వితీయంగా నిరూపించిన మహాకవయిత్రి మాతృశ్రీ తరి గొండ వెంగమాంబ.

పదకవితాపితామహుడైన తాళ్లపాక అన్నమాచార్యులు, భక్త కవయిత్రి తరిగొండ వెంగమాంబ–ఈ ఇరువురు ఆధ్యాత్మిక సాహితీ మూర్తుల అపూర్వ సారస్వత సిద్ధికి మూల కారణమైన 'నారసింహమంత్రరాజం' ఒకటే అయి ఉండటం ముదావహం!

కైంకర్యమే..
తనువు దాల్చితే....

11

– డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



(శ్రీరామానుజులు తిరుప్పాణాళ్వార్ కథ చెప్పిన తర్వాత కాంచీపూర్ణులు రామానుజులవారిని శిష్యునిగా స్వీకరించడం ఈ సంచికలో చదువవచ్చు.)

"తండ్రీ! శ్రీ రంగనాథా! శ్రీపరంధామా! రంగధామా! నీ అనుగ్రహానికి అవధిలేదా తండ్రీ! నీ దయ హద్దులెరుగదా దేవా! ఇంత భాగ్యమీ నశ్వరశరీరం భరించగలదా? ఇంత అదృష్టం నేనందుకోగలనా పరాత్పరా! శ్రీ రంగ రంగ రంగా!"

"నీది కాదు తిరుప్పాణ్, నాది కదా తరించిన జన్మం! నాది కదా పరమానంద జీవనం. శ్రీమహావిష్ణువు కోరిన భక్తుని, తిరుప్పాణ్ ఆశించిన శ్రీరంగనాథుని దర్శింప చేయగలిగితిని. భుజాలమీద భక్తుని మోయుటెంతటి అదృష్టం!" అని అంటూ తిరుప్పాణ్‌తో "కదలవద్దు – దిగ వద్దు. నీ దేవుని కనులార చూడు" అని చెప్పారు.

"అమలుడా– నీ భక్తులకు సేవకుడను. నిర్మలుడా– నీ దాసులకు దాసుడను. దేవా! దేవాదిదేవా! తిరువేంగడ పర్వతాగ్ర ప్రభూ! నిర్మలుడా! నిత్యుడా! నిర్వికల్పుడా! నిరంజనుడా! దేవా! నా నయనపద్మాలు నీ పాదపద్మాలతో తాదాత్మ్యం, తాద్రూప్యం పొందుతున్నాయి తండ్రీ!"

ఎన్నో తరాలుగా దేవుని సందర్శింపలేని జాత్యావేదన ఏకీకృత రూపమతడు, తిరుప్పాణ్ ఒక వ్యక్తి కాదు. వ్యవస్థ!

"మహర్షీ! మహాత్మా! మహాభక్తా! మా కనులపండిన తపస్స్వరూపమా! నీవెంత ధన్యుడవు!

"ఇదేమి ఆవేశం! ఇదేమి భక్తి రసావతారం!" అనుకున్నారు అక్కడి భక్తులు.

"శేషతల్ప శాయివయి శ్రీరంగమున కలంకారమైన తండ్రీ! తులసిమాలతో, సర్వతంత్ర స్వతంత్రాధికారంతో వెలిగెడి నీలవర్ణ దేహా! శంఖచక్రధారీ! నీకన్న విచిత్రుడెవడు? నీ అధరోజ్జ్వల చైతన్య రేఖ నన్ను సర్వతంత్ర పరతంత్రుని చేయసాగింది దేవా!"

"మహాభక్తా! తిరుప్పాణ్! శ్రీరంగనాథుని కనులార కనుగొన ఇంతకాలం ఉవ్విళ్లూరిన నీవు తృప్తితీర ఆపాదమస్తకం అభివర్ణించుకో!" అన్నారు లోకసారంగముని.

ఆ తన్మయత్వంలోనే పాదాదికేశాంతంగా భగవానుని దివ్య మంగళవిగ్రహాన్ని మునివాహనుడైన తిరుప్పాణ్ 'అమలనాదిపిరాన్' అని పదిపాశురాలను అనుగ్రహించారు.

చంటిబిడ్డకు తల్లిస్తన్యం వలే, శేషభూతునకు ధారకపోషక భోగ్యమై ఉండే శ్రీరంగనాథుని శ్రీచరణాల అందం తమను దాసునిగా చేసికొన్న విషయాన్ని మొదటిపాశురంలో పలికారు. సముద్రంలో చిక్కుకొన్న గడ్డిపరక కెరటాలతో అటు ఇటు కొట్టుకొని పోయి, ఒక కెరటం నుండి ఇంకొక కెరటానికి చేరేటట్లే, సముద్ర వర్ణుడైన శ్రీరంగనాథుని శ్రీచరణాలనుండి ఎఱ్ఱనివస్త్రంపై తమ మనస్సు చేరిన విషయాన్ని రెండోపాశురంలో పలికారు. తిరుప్పీతాంబర శోభ తమను నాభీకమలంలోకి తీసికొనిపోయిన వైనాన్ని గూర్చి పలికారు – మూడోపాశురంలో. తిరునాభీకమలంతో చేరిన ఉదరబంధాన్ని దర్శించిన రీతిని గురించి నాల్గవపాశురంలో పలికారు. "నాకు పురుషకారభూతురాలైన లక్ష్మీదేవి వేంచేసి ఉండే వక్షఃస్థలం కదా నా నుండి స్వరూపానురూపమైన కైంకర్యాన్ని గ్రహించింది" అని ఐదవపాశురంలో అన్నారు.

"లోకాలను అన్నిటిని ఆరగించిన స్వామికంఠం యొక్క అందం నాకు సత్తను కల్గించింది" అని అనడం ద్వారా వక్షస్సులోని అందం తమను కంఠశోభలోకి కొనిపోయిన క్రమాన్ని గూర్చి ఆఱవ పాశురంలో పలికారు. తెప్పకట్టును సహాయంగా చేసికొని ఈదగోరినవాడు "అయ్యో! తెప్పను కోల్పోయాను" అనే రీతిలో, ఇంతవరకు మనస్సుతో ఒక్కొక్క దివ్యాంగాన్ని అనుభవిస్తున్న ఆళ్వార్లు స్వామి అధరసౌందర్యాన్ని దర్శించగానే "మనస్సును కోల్పోయాను" అని ఏడవపాశురంలో అన్నారు. "తిరునేత్రాలు నా జ్ఞానాన్ని కొల్లగొట్టాయి"– అని ఎనిమిదవపాశురంలో పలికారు.

"స్వామి తిరుమేని, తన వద్ద ఉన్నదానిని అంతటినీ చూపి, నా దగ్గర ఉండే దానిని అంతటినీ దోచుకొన్నది"- అని తొమ్మిదవ పాశురంలో అన్నారు. ఈ తొమ్మిది పాశురాలను ఆళ్వార్లు గర్భ గృహంలోకి ప్రవేశించడానికి ముందు శ్రీరంగనాథుడు తన రూప సౌందర్యాన్ని వారి జ్ఞాననేత్రానికి సాక్షాత్కరింపజేయగా, "మనస్సు అనే ఆంతరనేత్రంతో" దర్శించి, పల్కినవి. లోకసారంగమహా మునుల భుజాలపై, వేంచేసి ఉండి, గర్భగృహంలోకి ప్రవేశించి, శ్రీరంగనాథుని సాక్షాత్తు కళ్లారదర్శించి, "శ్రీరంగనాథుని అందాన్ని దర్శించిన నా కన్నులు వేఱొకవస్తువును దేనినీ చూడదు" అని అంటూ తాము పెరియపెరుమాళ్‌తో అంతర్భవించిన రీతిని పదవ పాశురంలో పలికారు.

ఈ పదిపాశురాలలో రహస్యత్రయార్థం, అర్థపంచకం ఇమిడిఉన్నాయి. ప్రమాణసారమైన ప్రణవంలో ఉండే అకార-ఉకార-మకారాలతో మొదటి మూడుపాశురాలను ప్రారంభించడం ద్వారా ఈ ప్రబంధం ప్రణవసారమనే విషయాన్ని ఆళ్వార్లే తెలి పారు. ప్రమేయసారం భగవానుని పాదపద్మాల పాదుకయే అనే విషయాన్ని అయిదవ, ఆఱవ, ఏడవపాశురాలలోని మొదటి అక్ష రాలలోని మొదటి అక్షరాలద్వారా సూచించారు. ఈ రీతిలో అన్ని అర్థాలను తన లోపల ఈ దివ్యప్రబంధం ఇముడ్చుకొన్నది. ఈ దివ్యప్రబంధానికే మునివాహనభోగమని పేరు.

అలా అలా దివ్యపాశురగానం చేస్తూ చేస్తూ, అందరూ చూస్తుండగానే తిరుప్పాణ్ శ్రీరంగనాథునిలో ఐక్యమైపోయారు. మానవుని దేవుడు తనలో కలుపుకోవడం ప్రత్యక్షంగా మనుజులకు చూపించిన అపురూప భక్తశిరోమణి తిరుప్పాణ్.

"మహాశయా! ఇలాంటి మహనీయులందరూ నాకు మార్గ దర్శకులు. మీరు కాదనక నన్ను శిష్యునిగా స్వీకరించండి. కులాన్ని మరచి నాకు జ్ఞానాన్ని ప్రసాదించండి." అని రామానుజులు కాంచీపూర్ణుని మనస్సు కరిగించారు.

కాంచీపూర్ణులు కనులు వర్షించాయి. వారి హృదయద్రోణి అలలు, అలలుగా ఆనందంతో నిండిపోయి, పొర్లిపోయింది. రామానుజులను గట్టిగా కౌగిలించుకున్నారు. "నీవు లోకాచార్యు డవు కానున్నావు! నన్ను ఆచార్యునిగా ఎన్నుకున్నావు! భగవదాజ్ఞ అట్లే అగును గాక." రామానుజుల వదనం వెలిసింది! వెలిగి పోయింది!


"రామానుజా! తల్లి పనిలో ఉంటుంది. బిడ్డ ఏడుపు వినదు. బిడ్డ బిగ్గరగా ఏడుస్తాడు. తల్లి అన్ని పనులూ వదులు తుంది. పరిగెత్తుకొని వస్తుంది. అంతే ఆలస్యం. నాయనా! నీకు తెలిసింది సేవ. సేవ మధురం - మోక్షదాయకం. అనుదినమూ బిందెతో బావి తీర్థం తీసుకురా. స్వామికి అభిషేకం సమర్పించు" అని చెప్పారు.

రామానుజులు గురువాజ్ఞ ప్రకారం కైంకర్యం ప్రారంభిం చారు. రత్నం మనకోసం రాదు. రత్నంకోసం మనమే వెదకాలి. మహాత్ములూ అంతే!

కాంచీపూర్ణునికి రామానుజులంటే ఏమిటో పూర్తిగా అవ గాహనకొచ్చింది. తన సహాధ్యాయి, పూజ్యుడు అయిన శ్రీశైలపూర్ణు నికీ విషయం తెలిపి, "రామానుజులు మన ఆచార్యులు యాము నుని వారసుడనిపిస్తోంది." అన్నారు. అది విని శ్రీశైలపూర్ణుడు సంతోషించాడు. తన మేనల్లుడు తన అంచనాలు ఆశయాల మేరకు ఎదుగుతున్నాడని.


శ్రీశైలపూర్ణునికొక వెలితుండేది. అతని రెండో సోదరి కొడుకు గోవిందుడు మాత్రం అద్వైతానికి దాసుడయ్యాడని. ఒక ప్పుడు తన సలహానునుసరించే రామానుజ, గోవిందులిద్దరూ యాదవప్రకాశక్రీనీడకు చేరారు. అన్నదమ్ములిద్దరూ ఒకే గురువు దగ్గర పాఠాలు నేర్చుకుంటున్నా, నేర్చుకునే పద్ధతులు వేరు, అందువల్ల నేర్చుకున్నది వేరు. గోవిందునికి గురుభక్తిమెండు; గురునాజ్ఞ ఈశ్వరాజ్ఞ అతనికి. అంచేత విశ్లేషణకు ప్రాధాన్యత నిచ్చేవాడు కాదు. గురుముఖతః వచ్చిందే ప్రమాణం. స్వీయ విశ్లేషణ గురుద్రోహమన్న మూఢనమ్మకం గోవిందునిది. కానీ, రామానుజులు అట్లాకాదు. ఒక గురువు మాత్రమే కాదు, పెద్దలు ఎందరు ఎన్ని చెప్పినా దాన్ని అటూ ఇటూ పూర్వాపరాలన్నీ అన్ని కోణాల్లోంచి విశ్లేషించుకుని, అప్పుడు కానీ, దానిలోని సారాన్ని జీర్ణం చేసుకోడు. ఈ స్వీయవిశ్లేషణకు ఆయనకు నిమేష మాత్రమే సమయం పట్టేది. ఒకసారి మనసులోకి వచ్చేశాక మరుపనేది లేనే లేదు. అందువల్లే అందరూ రామానుజులకు ఏకసంథాగ్రాహి అని అనుకునేవారు.

(ఇంకా ఉంది)



కులశేఖరాళ్వార్ల సూక్తిలో ప్రణవార్థం

- డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు,
98850 03420



మార్చి, 8
కులశేఖరాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా.....

కుంభే పునర్వసౌ జాతం కేరళే చోళపత్తనే ।
కౌస్తుభాంశం ధరాధీశం కులశేఖర మాశ్రయే ॥

(మాఘమాసం పునర్వసు నక్షత్రంలో, కౌస్తుభమనే భగవంతుని మణి అంశతో కేరళదేశంలోని కొల్లినగర్ అనే నగరంలో జన్మించిన క్షత్రియులు కులశేఖరులను ఆశ్రయిస్తున్నాను.)

"ఓంకార ప్రభవావేదాః" అని సమస్త వేదవాఙ్మయానికి ప్రణవం మూలం. ఆ ప్రణవార్థం కులశేఖరుల పాశురాలలో అందంగా ఉపమాలంకార వైఖరిలో వ్యక్తం చేయబడింది. ఇందువల్లనే ఈ ఆళ్వార్ల పాశురాలను **"కొల్లి కావలన్‌పతిక్కుమ్ కలైక్కవి"** (కులశేఖరుల శాస్త్రార్థరూపాలైన పాశురాలు) అని శ్రీరంగామృతకవి (అముదనార్) కొనియాడారు. ప్రకృతం, ఈ ఆళ్వార్ల సూక్తులలో ఏవిధంగా ప్రణవార్థం అనుసంధింపబడిందో సోదాహరణంగా తెలుపబడుతున్నది.

ప్రణవం (ఓంకారం)– అకార, ఉకార, మకారాలనే మూడువర్ణాల మేళనంతో ఏర్పడింది. ఈ మూడు వర్ణాలను మూడుపదాలుగా గ్రహించి అర్థాన్ని చెప్పవచ్చు. మొదటి వర్ణమైన అకారం "అకారోవై సర్వావాక్" అనే రీతిలో సమస్త శబ్ద రాశికి మూలం. ఈ అకారాన్ని "అవ–రక్షణే" అనే ధాతువు నుండి నిష్పన్నమైన పదంగా గ్రహించే వీలున్నందున, ఇది జగద్రక్షణ స్వభావుడైన నారాయణునకు వాచకం కనుక, నారాయణుని రక్షకత్వాన్ని తెల్పుతున్నది. ఈ విధంగా అకారం ద్వారా నారాయణుని కారణత్వం, రక్షకత్వమనే స్వభావాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రణవంలోని రెండవ వర్ణం (పదం) ఉకారం. వేదంలో "తదేవ భూతం తదుభవ్యమా ఇదమ్" మొదలైన చోట్లలో ఉకారం అవధారణార్థకం. అవధారణమంటే అర్థాన్ని పరిమితం చేసి నిశ్చయించి పల్కడం. ఇక్కడ ప్రణవంలోని ఉకారం పూర్వం తెలుపబడిన శేషిత్వం నారాయణునకు మాత్రమే చెందినది, అంటే–జగత్తు అంతా నారాయణునకు మాత్రమే– ఇంకొకరికి కాదు – అనే అవధారణాన్ని వ్యక్తం చేస్తున్నది. అందువల్ల ఉకారం ద్వారా తెలియజేయబడే జగత్తుయొక్క శేషత్వంలోని అవధారణం ద్వారా నారాయణుడే జగత్తుకు భర్త అని స్ఫురిస్తున్నది.

కులశేఖరులు రచించిన ప్రబంధం 'పెరుమాళ్ తిరుమొళి' - అని వ్యవహరింపబడుతున్నది. ఈ ప్రబంధంలోని అయిదవ దశకంలోని పాశురాలలో కులశేఖరులు ప్రణవార్థాన్ని ఉపమాలంకార ప్రక్రియలో అనుసంధించారు.

ప్రణవంలోని చివరివర్ణం మకారం. ఈ మకారాన్ని "మన-జ్ఞానే" అనే ధాతువునుండి పుట్టిన పదంగా గ్రహించ వచ్చు కనుక, దీని ద్వారా (జీవుని) జ్ఞాతృత్వం సూచింపబడు తున్నది. "పంచ వింశోఽయమాత్మ పురుషః" అనే శ్రుతి దీనికి ప్రమాణం.

ఇందువల్ల ప్రణవంలోని మకారం జీవుని జ్ఞాతృత్వాన్ని తద్ద్వారా నారాయణుని జ్ఞేయత్వాన్ని తెలుపుతున్నది.

ఈ విధంగా ప్రణవం ద్వారా తెలియబడే నారాయణుని 1) కారణత్వ, 2) రక్షకత్వ, 3) శేషిత్వ, 4) భర్తృత్వ, 5) జ్ఞేయత్వాదులనే అయిదు స్వభావాలను కులశేఖరులు తమ సూక్తులలో హృద్యంగా అనుసంధించడం ద్వారా ప్రణవార్థాన్ని అనుశీలనం చేశారు. ఆ క్రమాన్ని గమనిద్దాం.

కులశేఖరులు రచించిన ప్రబంధం **'పెరుమాళ్ తిరుమొళి'** - అని వ్యవహరింపబడుతున్నది. ఈ ప్రబంధంలోని అయిదవ దశకంలోని పాశురాలలో కులశేఖరులు ప్రణవార్థాన్ని ఉపమాలంకార ప్రక్రియలో అనుసంధించారు. ఈ దశకంలో కులశేఖరులు కేరళదేశంలోని విత్తువక్కోడు క్షేత్రంలోని అర్చామూర్తిని ఉద్దేశిస్తూ పలికారు.

01) మొదటి పాశురంలో - "విత్తువక్కోడులోని, తల్లివంటి, స్వామీ! నీవు నాకు ఎన్ని క్లేశాలను కల్గించినా, నాకు నీ చరణాలు తప్ప ఇంకొక శరణంలేదు" అని పల్కడం ద్వారా కులశేఖరులు స్వామిని తల్లిగా కీర్తించారు. లోకంలో శిశువు జన్మలకు తల్లిదండ్రులే కదా కారణం. అందువల్ల ఈ ఉపమానం ద్వారా నారాయణుని **'కారణత్వం'** సూచింపబడింది.

02) అయిదవ పాశురంలో "వైద్యుడు, రోగిని కత్తితో కోసి, నిప్పుతో కాల్చినా, అది చికిత్సలో భాగమే కనుక, అతనిపట్ల రోగి కోపించడు. ఆ విధంగానే నీవు నాకెన్ని కష్టాలను కల్గించినా నీ పట్ల నేను కోపపడను" అని కులశేఖరులు పల్కడం ద్వారా భగవంతుని **'రక్షకత్వాన్ని'** సూచించారు. వైద్యుడు రోగికి రక్షకుడు కదా!



03) మూడవ పాశురంలో "ప్రభువు, తన ప్రజలను రక్షించకుండా, వారికి ఎన్ని ఇబ్బందులను కల్గించినా, ఆ ప్రభువు శాసనాన్ని మీరని సత్కుల సంజాతుని వలె ఉన్నాను" అని పల్కుతూ కులశేఖరులు నారాయణుని **'శేషిత్వాన్ని'** తెలిపారు. రాజ్యంలోని ప్రజలంతా ఆ రాజ్యాన్ని పాలించే ప్రభువుల శేషం కదా!

04) రెండవపాశురంలో- "చూచేవారు నిందించే కృత్యాలను చేసినా, అతనిని తప్ప ఇంకొకరిని తెలియని కులపతివలె ఉన్నాను" అని పల్కి కులశేఖరులు స్వామియొక్క జగత్ **'భర్తృత్వాన్ని'** తెలిపారు.

05) ఆరవ పాశురంలో - "ఎంతగా వేడి చేసినా, తామర పూవు, సూర్యుని చూస్తే తప్ప వికసించదు. ఆ విధంగానే, నీ కల్యాణ గుణాలను తప్ప వేరొక దానికి నా మనస్సు వికసించదు" అని అంటూ స్వామియొక్క **'జ్ఞేయత్వా'**న్ని సూచించారు. భగవద్గుణానుభవమంటే భగవద్విషయంలోని జ్ఞానమే కదా! ఇక్కడ చెప్పబడిన తామర హృదయ కమలమే.

ఈ విధమైన వేదార్థతత్త్వాలు కులశేఖరుల సూక్తులలో పదే పదే గోచరిస్తాయి.



పురుషోత్తముడైన శ్రీ మహావిష్ణువు పట్టపు దేవేరి మహాలక్ష్మి. వైకుంఠధామంలో అనుక్షణం భర్తతో కలిసి ఉండే అనపాయిని ఆమె. అమ్మా! అని ఆర్తితో పిలిస్తే చాలు కష్టాలన్నింటినీ పోగొట్టి... ఆప్యాయంగా అక్కున చేర్చు కుంటుంది... సర్వశుభాల్ని కలిగించి... అనంతమయిన ఆనందాన్ని అందిస్తుంది. ఆ తల్లి కరుణాకటాక్షం ప్రసాదిస్తే చాలు కటిక దరిద్రుడు కూడా కోట్లకి పడగలెత్తుతాడు. ఆమె కోపిస్తే ఎంతటి భాగ్యవంతుడైనా నిరుపేదగా మారి పోతాడు. సృష్టిలో మరెక్కడా కనిపించని అనిర్వచనీయమైన సౌందర్యం ఆమెది. మహర్షుల దృష్టిలో మహాలక్ష్మి చిచ్ఛక్తి... పరమజ్ఞాన తత్త్వం. యోగులు మాత్రం ఆ తల్లిని అపారచైతన్యాన్ని కలిగించే కుండలినీశక్తిగా భావిస్తారు.

నిత్యానపాయిని

– శ్రీ డి.శ్రీనివాస దీక్షితులు,
94918 96276

జగన్మాతను గూర్చి బ్రహ్మమానస పుత్రుడైన భృగుమహర్షి కఠోరమయిన తపస్సు చేశాడు. ఆ తపస్సుకి మెచ్చి జగన్మాత ప్రత్యక్షమయింది. ఆమెను అనేక విధాలుగా స్తుతించాడు మహర్షి.

అప్పుడు ప్రసన్నురాలైన జగన్మాత "మహర్షీ! ఏదైనా వరం కోరుకో" అంది.

"తల్లీ! నువ్వు... నా కుమార్తెగా జన్మించాలి!" అని వరం కోరుకున్నాడు భృగుమహర్షి.

"తథాస్తు! "అని మహర్షిని అనుగ్రహించి అంతర్ధానమయింది ఆ జగన్మాత.

ఆనందంతో ఆ విషయాన్ని తన భార్య అయిన ఖ్యాతికి చెప్పాడు భృగుమహర్షి. ఆమె కూడా ఆనందించింది. తర్వాత... జగన్మాత వైభవకళతో ఖ్యాతి కడుపున జన్మించింది. ఆ ఇంట ఆమె "భార్గవి"గా పెరిగి పెద్దదయింది. కానీ, ఆమెను భృగుమహర్షి జగన్మాత అయిన మహాలక్ష్మిగానే భావిస్తున్నాడు. మహావిష్ణువుని భర్తగా పొందాలని అనుకుని ఆ విషయం తండ్రికి చెప్పింది మహాలక్ష్మి. ఆయన సూచనతో ఆమె విష్ణువుని గూర్చి గొప్ప తపస్సు చేసింది. ఆమె తపస్సుకి మెచ్చి మహాలక్ష్మిని వివాహమాడటానికి అంగీకరించాడు మహావిష్ణువు. వెంటనే మహర్షిదంపతులు మహాలక్ష్మిని మహావిష్ణువుకు ఇచ్చి వైభవంగా వివాహం చేశారు.

ఒకనాడు దుర్వాసమహర్షి వైకుంఠానికి వెళ్ళాడు. లక్ష్మీనారాయణుల్ని దర్శించుకున్నాడు. ఆ సమయంలో చనువు తీసుకుని మహాలక్ష్మి ఆ మహర్షితో పరిహాసంగా మాట్లాడింది. అందుకు కోపించిన దుర్వాసమహర్షి "మహాలక్ష్మీ! మహర్షులతో మాట్లాడే తీరు ఇదేనా? నాతోనే పరాచకాలాడతావా? నాకు కోపం కలిగించావు...ఫలాన్ని నువ్వు అనుభవించక తప్పదు! నువ్వు పాలసముద్రంలో పడిపోదువుగాక! క్షీరసాగర మథన సమయంలో మళ్ళీ పుట్టి మహావిష్ణువుని చేపడ తావు!" అని శాపాన్ని ఇచ్చి..... శాపవిమోచనాన్ని కూడా చెప్పాడు దుర్వాస మహర్షి.



పాలకడలి నుంచి ప్రాదుర్భావం...

మందర పర్వతాన్ని కవ్వంగా...వాసుకిని తాడుగా చేసుకుని అమృతం కోసం పాలసముద్రాన్ని చిలుకుతున్నారు. అదే క్షీరసాగర మథనం. మందర పర్వతాన్ని మునిగిపోకుండా అడుగున ఆసరాగా విష్ణువు కూర్మావ తారంలో కాపాడుతున్నాడు. ముందుగా మథనంలోంచి హాలాహలం పుట్టింది. దానిని శివుడు కంఠంలో ధరించి నీలకంఠుడయ్యాడు. తర్వాత క్రమంగా మహా లక్ష్మి జన్మించింది.

కఠినమైన వాక్కును త్యజించు

ఆ రోజు ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ.

మహాలక్ష్మికి ఎనిమిది రూపాలున్నాయి. వాటినే అష్ట లక్ష్మీరూపాలు అంటారు. ధర్మబద్ధమైన ధనాన్ని ప్రసాదించి జీవితాన్ని ఆనందమయం చేస్తుంది **"ధనలక్ష్మి"**. పాడిపంటల్ని సమృద్ధిగా ఇచ్చి సుఖసంతోషాల్ని కలిగిస్తుంది **"ధాన్యలక్ష్మి"**. అష్టకష్టాల్ని భరించటానికి కావలసిన ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది **"ధైర్యలక్ష్మి"**. రాజ్యాన్ని సుభిక్షంగా ఉంచుతుంది **"రాజ్యలక్ష్మి"**. శత్రువులమీద విజయాన్ని సాధించి పెడుతుంది **"విజయలక్ష్మి"**. అజ్ఞానమనే అంధకారాన్ని పోగొట్టి జ్ఞానమనే వెలుగుని పంచి పెడుతుంది **"జ్ఞానలక్ష్మి"**. వంశాభివృద్ధిని చేసే మంచి సంతానాన్ని అనుగ్రహిస్తుంది **"సంతానలక్ష్మి"**. పరాక్రమాన్ని ప్రసాదిస్తుంది **"వీరలక్ష్మి"**.

సిరులనిచ్చే కల్పవల్లి

దాసీ జనం... సేవకగణం... మిత్రబృందం... బంధు వర్గం... వాహనాలు... ధనం... ధాన్యం ఈ ఎనిమిదింటినీ అష్టైశ్వర్యాలు అంటారు అణిమ... మహిమ... గరిమ... లఘిమ... ప్రాప్తి... ప్రాకామ్యం... ఈశత్వం... వశిత్వం... అనే ఈ ఎనిమిదింటినీ అష్టసిద్ధులు అంటారు. అష్టైశ్వర్యాల్ని కానీ అష్టసిద్ధుల్ని కానీ పొందాలంటే మహాలక్ష్మీ కరుణాకటాక్షం ఉండాలి.

ఈ చరాచర సృష్టి అంతా మహాలక్ష్మి స్వరూపమే!. మహాశక్తిమంతురాలైన ఆమె కర్మపంచకం పేరుతో సృష్టి.. స్థితి... అనుగ్రహం... సంహృతి.... తిరోభావం అనే అయిదు కార్యాల్ని నిర్వహిస్తూ ఉంటుంది. సకల చరాచర ప్రపంచాన్ని కల్పించడమే **'సృష్టి'**. ఆ విధంగా కల్పించిన దానిని కాపాడటమే **'స్థితి'**. అలా కాపాడుతున్న సృష్టిమీద కరుణాకటాక్షాల్ని ప్రసరింప చెయ్యడమే **'అనుగ్రహం'**. తాను కల్పించిన ఆ సృష్టిని ఉపసంహ రించుకోవడమే **'సంహృతి'**. అలా ఉపసంహరించుకున్న సృష్టిని తనలో లయం చేసుకోవడమే **'తిరోభావం'**.

ఈ కర్మ పంచకాన్ని నిర్వహించే సమయంలో ఆమె లోనే నెలకొని ఉన్న జ్ఞానం... ఐశ్వర్యం... శక్తి... బలం... వీర్యం... తేజస్సు అనే ఆరు గుణాలు ఆమెకు సహకరిస్తాయి.

జయంతి నాడు ఏం చెయ్యాలి ?

పూర్ణిమనాడు చంద్రుడు ఉత్తరఫల్గునీ నక్షత్రంతో కలిసి ఉండటం చేత ఈ నెల ఫాల్గుణ మాసం అయింది. చాంద్ర మానం ప్రకారం సంవత్సరంలో ఈ నెల చివరిది. ఫాల్గుణ శుద్ధ పూర్ణిమని మహాఫాల్గుణి అంటారు. పాలకడలి నుంచి మహాలక్ష్మి ప్రాదుర్భవించింది ఈనాడే.

అందువల్ల ఫాల్గుణశుద్ధ పూర్ణిమనాడు **'శ్రీలక్ష్మీ జయంతి'**ని జరుపుకోవడం సంప్రదాయమయింది. ఈరోజు అమ్మ వారిని నాలుగువిధాలుగా ఆరాధించాలని... దానివల్ల సర్వ సంపదలు కలుగుతాయని ఆగమగ్రంథాలు చెబుతున్నాయి.

1) లక్ష్మీజపం

శ్రీసూక్తంతో లేదా లక్ష్మీ మంత్రంతో 1008 సార్లు జపం చెయ్యాలి. ప్రతిదినం లక్ష్మీమంత్రాన్ని పదివేలు జపిస్తూ... మహాలక్ష్మిని వెయ్యి తామర పూలతో పూజిస్తూ... పాలను మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ... పుష్కరకాలం (12 సంవత్స రాలు) శ్రీనివాసుడు కఠరమయిన తపస్సు చేస్తే మహాలక్ష్మి కరుణించింది.

2) లక్ష్మీహోమం

శ్రీసూక్తంతో పౌండరీక హోమం చెయ్యాలి. తేనెలో ముంచి తామర పూలని... మారేడు కాయల్ని హోమాగ్నిలో వ్యాహృతులుగా వెయ్యాలి.

3) లక్ష్మీపూజ

మోక్షాన్ని కోరుకునే వాళ్ళు తామర పూలతోను... సంపదల్ని కోరుకునేవాళ్ళు మారేడు దళాలతోను లక్ష్మీసహస్ర నామపూజ చెయ్యాలి.

4) లక్ష్మీధ్యానం

ఏకాగ్రమయిన మనస్సుతో లక్ష్మీ సహస్రనామ స్తోత్రాన్ని పఠిస్తూ అమ్మ వారిని ధ్యానించాలి.

స్త్రీలు కన్నీరు కార్చని ఇంట్లో... పచ్చని తోరణాలు కట్టిన ఇంట్లో... ముత్యాల ముగ్గులు వేసిన ముంగిళ్ళలో... మంగళవాద్యాలు వినిపించే చోట... గోవులు మసలే చోట... తెల్లపావురాలు ఉన్న చోట... మంచి మనస్సుల్లో... విరిసిన కమలాల్లో... పారిజాత సుమదళాల్లో... తులసీ దళాల్లో... బిల్వపత్రాల్లో... మామిడి పళ్ళలో...దీపం వెలుగుల్లో... స్వచ్ఛంగా పరిశుభ్రంగా ఉండే ప్రదేశాల్లో మహాలక్ష్మి కొలువై ఉంటుంది.

క్షీరాబ్ధి కన్యకు శ్రీమహాలక్ష్మికిని నీరాజనం!

రామాభ్యుదయము
(రెండు భాగాలు)

వ్యాఖ్యాత- కందుకూరి సత్యసూర్యనారాయణమూర్తి, పుటలు- 980 పుటలు, సైజు - 1/8 డెమ్మీ సైజు ధర - రూ.700/- (రెండు భాగాలు కలిపి), దొరుకుచోటు : కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, ఇ.నెం.46-12-21, వి.టి.ఇంగ్లీషుమీడియం స్కూల్ దగ్గర, దానవాయిపేట, రాజమండ్రి - 533 103. చరవాణి-94905 99403

తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీకృష్ణదేవరాయలయుగం స్వర్ణ యుగం. ఆయన స్వయంగా కవియేగాక అష్టదిగ్గజ కవులను పోషించాడు. వారిచేత అద్భుత ప్రబంధాలు రచింపజేశాడు. ఆ కవుల పరంపరలోని కవి అయ్యలరాజు రామభద్రుడు. ఈయన కలంనుంచి వెలువడిన గ్రంథం రామాభ్యుదయం. ఇది ఎనిమిదాశ్వాసాల ప్రౌఢ ప్రబంధం. ఇందులో 1,825 పద్య గద్యలున్నాయి.

రామాభ్యుదయంలో రామాయణ కథంతా సంగ్రహంగా చెప్పబడింది. శ్రీరామపట్టాభిషేకంతో ముగిసింది. ఇందులో ఉత్తర కాండ కల్పనలు, అలంకారాలు, ధ్వని, చమత్కారాలు చక్కగా చిత్రించబడ్డాయి. అయితే తెలుగు రామాయణాల్లో ఇతర వాటికి లభించినంత ఖ్యాతి ఏ కారణం వల్లనో రామాభ్యుదయానికి లభించలేదు. బహుశా ఈ గ్రంథం వెలుగులోకి రాకపోవటం కారణం కావచ్చు. ఈ లోటును తీర్చటానికి కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణగారు రామాభ్యుదయాన్ని రెండు భాగాలుగా వెలువరించారు. మొదటి భాగంలో నాలుగాశ్వాసాలు,రెండోభాగంలో నాలుగాశ్వాసాలున్నాయి. కవి మూల రామాయణాన్నే అనుసరించి సమయోచితంగా అక్కడక్కడ కొన్ని మార్పులు చేసి తన స్వతంత్రతను ప్రకటించుకున్నాడు.

ఈ గ్రంథంలో మూలపద్యం, ప్రతిపదార్థం, భావం సరళ భాషలో ఇవ్వబడ్డాయి. వందపుటల సంగ్రహపీఠిక ఇవ్వబడింది. ఇందులో ఈ గ్రంథానికి సంబంధించిన అన్ని సాహిత్యాంశాలు చర్చించబడ్డాయి. క్లిష్టమనుకొన్న చోట్ల అనువాదకుడు చక్కని వ్యాఖ్యానం ఇచ్చాడు. ఈ గ్రంథాన్ని చదివితే తక్కిన రామాయణ గ్రంథాలకు ఇది ఏ విధంగానూ తీసిపోదని, వాటిలో మిన్నగానే ఉంటుందని పాఠకులు అభిప్రాయపడుటకు అవకాశముంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ గ్రంథం మరుగున పడిన మాణిక్యమనే అనవచ్చు. ఈ మాణిక్యాన్ని వెలుగులోకి తెచ్చిన వ్యాఖ్యాత కృషి నిరుపమానమైనదిగా చెప్పవచ్చు.

అక్షరదోషాలు లేకుండా రచయిత తీసికున్న శ్రద్ధ బహుధా ప్రశంసనీయం. మంచి దళసరి కాగితంపై చక్కగా ముద్రించబడిన ఈ గ్రంథం ప్రతి సాహితీవేత్త, ఆధ్యాత్మికవేత్తల ఇంటిలో ఉండదగింది.

– డి.సరళ

గ్రంథసమీక్ష

శ్రీకృష్ణవచనామృతం
(గీతామకరందం)

రచయిత- వద్దిపర్తి రాజారావు శ్రీవత్స
పుటలు- 310 పుటలు,
ధర - రూ.100/-,
సైజు- 1/8 డెమ్మీ సైజు,

దొరుకుచోటు :
వద్దిపర్తి బుచ్చిబాపుజీ,
ఇ.నెం.1-18-55/1-2,
ఎం.ఇ.ఎస్.కాలనీ ఎక్స్‌టెన్షన్,
వెంకటాపురం,
తిరుమల గిరి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 015.
చరవాణి - 94414 62080
(లేదా)
తల్లాప్రగడ భాస్కరరావు,
ఇ.నెం.2-362, బాలాజీనగర్,
ఎ.పి.ఎస్.పి.ఎదురుగా,
కాకినాడ-533 005.
చరవాణి - 94409 81133

హిందువుల పవిత్రగ్రంథం భగవద్గీత. సాక్షాత్తు శ్రీకృష్ణభగవానుడు కురుక్షేత్ర యుద్ధభూమిలో అర్జునునికి గీతను ఉపదేశించాడు. ఇందులో సర్వశాస్త్రాలసారం, వేద వేదాంతాది ఆధ్యాత్మిక గ్రంథాల్లోని తత్త్వం నిక్షిప్తమై ఉంది. వేదాలు తొలినుండి మానవులకు సత్కర్మలు చేయవలసిన రీతిని వివరించాయి. ఆ తర్వాత జ్ఞానబోధ యోగయుక్తి చెప్పి మోక్షాసక్తులను చేశాయి. ఆ వేదాలసారం భగవద్గీతలో ఉంది.

భగవంతుడు ఉపనిషద్ధేనువులను పితికి అర్జునుడనే వాని నెపంతో మనకందరికి ఇచ్చిన జ్ఞానామృత క్షీరధారలే గీత. ఇది ఉపనిషత్తుల్లో కెల్ల ఉన్నతమైంది. మన జీవిత వికాసమునకు అవసరమగు ముఖ్య విషయాలను భగవానుడు భగవద్గీతలో చేర్చి మనకందించాడు. వానిని సేవించి తరించాల్సిన బాధ్యత మనదే. గీతాప్రబోధం అమరవాణి. ఆత్మ అమరము, నాశనము లేనిది, అఖండము. ఒక వ్యక్తి నిత్యజీవితంలో ఎపుడుఎలా మెలగాలో శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో బోధించాడు.

కర్తవ్యములు, కర్మలు ఆచరిస్తూనే ఆ కర్మ బంధాలను తెంచుకుని బయటబడి తరించే మార్గాన్ని భగవంతుడు గీతలో మనకు సూచించాడు. వాటిని ఆచరించుట మన విధ్యుక్తధర్మము. గీతను కీర్తించినవాడు కృష్ణుడు. దానినాచరించి తల్లీనుడై తరించినవాడు అర్జునుడు. ఆ గీతాబోధల మనకందరకందించి తరింపజేసిన వ్యాసదేవుడు కృష్ణుడైనాడు. ఇంతటి విశిష్టత కలిగిన గీతను ఎందరో అనువదించారు, వ్యాఖ్యానించారు, విశ్లేషించారు. ఈ కోవలోనే వద్దిపర్తి రాజారావు శ్రీవత్సగారు 'శ్రీకృష్ణవచనామృతం' పేరుతో గీతామకరందాన్ని మనకు అందిస్తున్నారు. ఇందులో మూల భగవద్గీతను యథాతథంగా ఇస్తూ ప్రతి శ్లోకం క్రింద ఆ శ్లోకభావాన్ని పద్యంగా రాసి, దానికి చక్కని భావం కూడా ఇచ్చారు. ఇది వినూత్నమైన ప్రయోగం.

మంచి దళసరి కాగితంపై అందంగా ముద్రించబడింది. అక్షరదోషాలు దాదాపుగా లేవనే చెప్పవచ్చు. ప్రతి ఆధ్యాత్మికవేత్త కరభూషణంగా ఈ గ్రంథం అలరారుతుందని చెప్పవచ్చు. – డా॥ కె.రెడ్డెప్ప

తిరుమలేశుని సేవలో... తెల్లదొరలు

- కీ॥శే॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

తిరుమలపై వెలసిన శ్రీవేంకటేశ్వరుడు లోకారాధ్యుడుగా దేశీయుల చేతనేగాక విదేశీయులచేత, విమతీయులచేత అర్చనలందుకుంటున్నాడు. మన దేశాన్ని పాలించిన కొందరు తెల్లదొరలు కూడా తిరుమలేశుని పట్ల భక్తి శ్రద్ధలు కల్గి కైంకర్యం చేశారు.

రాయలసీమ జిల్లాల మొట్టమొదటి కలెక్టర్ సర్ థామస్ మన్రో. అతడు దైవభక్తి కలవాడు. తిరుమలస్వామి దర్శనం చేసుకున్నాడు. ప్రతిదినం స్వామివారికి మొదట నైవేద్యం ఏర్పాటు చేశాడు. ఆ ఏర్పాటు నేటికీ, 'గంగాళ ప్రసాదంగా' కొనసాగుతున్నది. కొన్ని గ్రామాల నుండి వచ్చే రాబడిని ఆలయ కైంకర్యాలకు అందజేసినట్లు చరిత్ర తెలుపుతున్నది. శ్రీవేంకటేశ్వరుని పట్ల మన్రో దొరకుగల భక్తి ప్రపత్తుల గురించిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ఒకమారు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న మన్రో దొర, తన బాధ నివారణ చేయవలసినదిగా స్వామిని మొక్కుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా కొన్ని మాన్యాలను శ్రీవారి ఆలయాలకు అప్పగించాడు. తిరుమల దేవాలయాలకే గాక మరెన్నో దేవాలయాలకు విరివిగా మాన్యాలను ఏర్పాటు చేశాడు.



చెన్నైలోని మన్రో విగ్రహం

భారతదేశ సర్వేయర్ జనరల్‌గా పనిచేసిన కల్నల్ కాలిన్ మెకంజీ 19వ శతాబ్దం ప్రథమ దశకంలో స్థానిక చరిత్రలను ఆనాటి కరణాలచేత వ్రాయించాడు. వాటిని కైఫియత్తులు అంటారు.

ఈ కైఫియత్తులలోని స్థానిక చరిత్రలు, చరిత్రకు ఎక్కలేదు. అలాంటి ఒక చరిత్ర తాళ్లపాక పెద్ద తిరుమలాచార్యుల కైంకర్యమును తెలుపుచున్నది. తాళ్లపాక అన్నమాచార్యుల పుత్రుడైన పెద్ద తిరుమలాచార్యులు అనేక అగ్రహారాలను దానంగా స్వీకరించి, ధనాన్ని సంపాదించి శ్రీవేంకటేశ్వరుని కైంకర్యాలకు వినియోగించాడు. కడప జిల్లాలోని మాచనూరు గ్రామాన్ని అగ్రహారంగా స్వీకరించి ఆ ప్రాంతాన్ని సుభిక్షం చేశాడు. విజయనగరరాజైన అచ్యుత

**కలెక్టర్ సర్ థామస్ మన్రో
దైవభక్తి కలవాడు.
తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని
దర్శనం చేసుకున్నాడు.
ప్రతి దినం వేంకటేశ్వరస్వామివారికి
మొదట నైవేద్యం జరిగేలా ఏర్పాటు చేశాడు.
ఆ ఏర్పాటు నేటికీ,
'గంగాళ ప్రసాదం' గా
కొనసాగుతున్నది.**

దేవరాయలనుండి అగ్రహారంగా స్వీకరించిన మాచనూరు గ్రామం అప్పట్లో శిథిలమై ఉండినది. పొలం అరణ్యంగా మారింది. పెద్దతిరుమలాచార్యులు, ఆ గ్రామాన్ని పునరుద్ధరించి నగరులు కట్టించారు. పొలాన్ని వ్యవసాయయోగ్యంగా మార్చాడు. ఈ చరిత్రను రికార్డు చేయించి, తిరుమల స్వామికి జరిగే కైంకర్యాలలో పాలుపంచుకొన్న మరో తెల్లదొర 'కాలిన్ మెకంజి'.

మాచనూరు కైఫీయత్తులోని మరికొన్ని వివరాలు. గ్రామానికి తూర్పున విఘ్నేశ్వర ఆలయం, దక్షిణాన ఈశ్వరాలయం, పడమట ఆంజనేయ దేవాలయం కట్టించారు. గ్రామ మధ్యభాగమున చెన్నకేశవ ఆలయం కట్టించారు. ఇది ఇలా ఉండగా ఒకసారి తిరుమలలోని వెంకటేశ్వరుని దేవాలయంలో స్వామి సన్నిధిలో ఉన్న ఉత్సవ విగ్రహాన్ని సంపుటంతోకూడా దొంగలు దోచుకున్నారట. వారు తిరుమల దాటి వచ్చారట. దారిలో చోరులకు కన్నులు కన్పించకుండా పోయినవట. స్వామి కరుణించాడు. "నన్ను దొంగలించిన నేరానికి మీకు కన్నులు కన్పించలేదు. అయినా మీ మీద జాలి వహిస్తున్నాను. నన్ను తాళ్లపాక పెద్ద తిరుమలాచార్యుల వద్దకు చేర్చండి" అని చెప్పినట్లుంది. దొంగలు ఇతరులను తోడు తీసుకొని మాచనూరుకు వచ్చి సంపుటముతో పాటు స్వామి విగ్రహాన్ని తిరుమలాచార్యులకు అప్పగించారట. ఆ తరువాత చోరులకు దృష్టి వచ్చిందట.



కల్నల్ కాలిన్ మెకంజీ
మరియు అతని సహాయకులు

పెద్ద తిరుమలాచార్యులు సంపుటం తెరచి స్వామి విగ్రహానికి సంప్రోక్షణ చేశాడు. నాటినుండి స్వామివారిని అర్చిస్తూ తిరుమలలోని దేవాలయం ముఖ్యులకు ఈ వార్త చేరవేసి స్వామిని తిరుమలకు చేర్చుకొమ్మని చెప్పాడు. దేవాలయ ముఖ్యులు స్వామిని మాచనూరునుండి తీసుకు రావడానికి పల్లకి సిద్ధం చేసుకున్నారు. నాటి రాత్రి స్వామి వారికి కలలో కన్పించి, నన్ను పెద్ద తిరుమలాచార్యులవద్దనే ఉంచండి అన్నారు. ఆలయ ముఖ్యులు స్వామిని తీసుకు రావడం మానుకొని ఆ వర్తమానం పెద్దతిరుమలాచార్యులకు తెలియజేశారు.

ఈ వివరములన్నీ అచ్యుతదేవ మహారాయలకు ఎరుక చేశారు. రాయలు మాచనూరుకు వేంచేసి స్వామి అర్చన దీపారాధన మహోత్సవములు చక్కగా జరుపుటకు గాను "మురికినాటి సీమలోను, తుమ్మలూరు, గిద్దలూరు సీమలోను పొదదుర్తి, దువ్వూరు సీమలోను, కొమనూరు, అలిదెన అగ్రహారమునకు చెల్లే లేటపల్లె" గ్రామాలను జాగిర్లుగా ఇచ్చారు. ఈ గ్రామాలు తాళ్లపాకవారికి అగ్రహారాలుగా నడిచినట్లు శిలా శాసనములు భోగపట్టముల ఋజువు ఉన్నది.

లేటపల్లి కైఫీయత్తులో దేవాలయాలను పేర్కొంటూ "గ్రామానికి ఉత్తర భాగమందు తాళ్లపాకవారు కట్టించిన హరిహరాదుల దేవాలయములు రెండూ" అని వ్రాయబడి ఉన్నది.

మెకంజి దొర వ్రాయించిన కైఫీయత్తులలో ఆయా ప్రాంతాల దేవాలయాలకు సంబంధించిన వివరములు ఉన్నవి. ఈ విధంగా తెల్లదొరలు స్వామిసేవలో తరించి వారి కృపకు పాత్రులై తమ భక్తి ప్రపత్తులు చాటుకొన్నారు.

అతడుంటే అన్నీ ఉన్నట్లే..!

– డా॥ గరికపాటి నరసింహారావు

తన వెంటన్ సిరి, లచ్చివెంట నవరోధవ్రాతమున్ దానివె
న్కను బక్షీంద్రుడు, దాని వెన్కను ధనుః కౌమోదకీ శంఖ చ
క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీ కాంతుండురా వచ్చి రొ
య్యన వైకుంఠ పురంబునం గలుగు వా రాబాలగోపాలమున్

ఈ పద్యం ఆంధ్ర మహాభాగవతంలోని గజేంద్ర మోక్షం ఘట్టం లోనిది. దీని అర్థమే పోతన జీవన విధానం.

గజేంద్రుడు మొసలిబారి నుండి తనను కాపాడమని ఎవరిని ప్రార్థించాడు? భాగవత పద్యాలలో చూస్తే 'ఈశ్వరా, ఈశ్వరా' అనే సంబోధనలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇక్కడ ఈశ్వరుడంటే శివుడు కాదు, విష్ణువూ కాదు. బ్రహ్మ అసలే కాదు. మొత్తం అనంతకోటి బ్రహ్మాండాలకు అధిపతియైన పరమేశ్వరుడన్న మాట. అందుకే 'పరమేశ్వరుడెవ్వడు, మూలకారణం బెవ్వడు' అని పేర్కొన్నాడు. మరి సర్వలోకాధిపతి, ఆత్మ చైతన్య స్వరూపుడు అయిన భగవంతుణ్ణి ప్రార్థిస్తే విష్ణువు చక్రాయుధుడై వచ్చి కాపాడడమేమిటి? అంటే మనం భగవంతుణ్ణి 'ఫలానా రూపంలో వచ్చి నన్ను కాపాడు' అని ప్రార్థిస్తే అలాగే వస్తాడు. ఏ రూపమో ప్రత్యేకించి చెప్పకపోతే – స్థితికర్త, పాలన, పోషణ చూసే బాధ్యత కలవాడు విష్ణువు కాబట్టి ఆయన వస్తాడు. లోకంలోనూ అంతే. మనకు ఆపద వచ్చినప్పుడు ఎవరినైనా పేరుబెట్టి పిలిచి, లేదా వారింటికి వెళ్లి అర్థిస్తే దగ్గరలో ఉన్న రక్షక భటులు వచ్చి కాపాడతారు. రక్షణ బాధ్యత వారిది కాబట్టి. అందుకే విష్ణురూపంలో సర్వేశ్వరుడు వచ్చాడు.

అది సరే. **గజేంద్రుడు కేవలం భగవంతుణ్ణి వచ్చి తన ప్రాణాలు కాపాడమని మాత్రమే కోరాడు. కాని అడగకపోయినా ఆయన వెంట లక్ష్మీదేవి, ఆమె వెంట అంతఃపుర స్త్రీలు, వారి వెంట గరుత్మంతుడు, అతని వెనుక విల్లు, గద మొదలైన ఆయుధాలు, ఆ పైన వైకుంఠానికి విష్ణుదర్శనం కోసం వచ్చిన నారదమహర్షి, ఇంకా సర్వసైన్యాధిపతియైన విష్వక్సేనుడు.. ఒకరేమిటి వైకుంఠంలో ఉండే బాలుర నుండి గోపాలుర వరకు అందరూ గజేంద్రుని వద్దకు వచ్చేశారు.** అంటే మనం భగవంతుని దర్శనం కోసం ప్రార్థిస్తే చాలు. ఆ దర్శనంతోనే సిరిసంపదలు వస్తాయి. దాసదాసీజనం సమకూరుతారు. వస్తు వాహనాలు కొన గలిగే శక్తి కలుగుతుంది. మన రక్షణ కోసం సర్వాయుధాలూ వస్తాయి. మహాత్ములు, మహాయోగుల సాంగత్యమూ కలుగుతుంది. అత్యున్నత అధికారులు అందరూ మన చుట్టూ తిరుగుతారన్న మాట. ఈ రహస్యం తెలిసిన వాడు కాబట్టే పోతన మహాకవి రాజుల చుట్టూ, మంత్రుల చుట్టూ, వ్యాపారుల చుట్టూ తిరగడం మానేసి ఒక్క విష్ణువు చుట్టూ మాత్రమే మనస్సుని ప్రదక్షిణం చేయిస్తూ భాగవతం రచించాడు.

అందుకే ఆయన ఇహలోక జీవితమూ సుఖంగా ముగిసింది. పరలోకంలో మోక్షమూ దక్కింది.

ఆయన రచించిన భాగవతం ఇవ్వేళ ప్రపంచమంతా ప్రశంసలందుకొంటోంది. ఈనాటి కవులూ, పండితులూ ఈ రహస్యం గ్రహించి అధికారంలో ఉన్నవారి చుట్టూ తిరగకుండా భగవంతునియందు ఆత్మవిశ్వాసంతో తమ పని ఏదో తాము చేస్తే దక్కవలసిన గౌరవాలు అవే దక్కుతాయి.




అప్పికట్ల, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం

- ఆచార్య వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్య

'కలౌ వేంకట నాయకః' అన్న ఉక్తి ననుసరించి నేటి కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడే నాయకుడు. ఆయనే సర్వదేవతాస్వరూపుడు. సర్వాంతర్యామి. భక్తులపాలిట పెన్నిధి. అందుకే అడుగడుగు దండాలవాడని సప్తగిరీశుడని ఆపద మ్రొక్కులవాడని ప్రసిద్ధి చెంది తిరుమలక్షేత్రంలో ఆవిర్భవించాడు. ఆనందనిలయ దివ్యవిమానాంతర్గతుడే నవరత్న ఖచిత దివ్యాభరణ ధారణతో జగజ్జేగీయమానంగా ప్రజ్వరిల్లుతూ భారతావని అంతా తనదే అన్నట్లు గ్రామ గ్రామానా, పల్లెపల్లెనా తన ఆలయాల్నే నిర్మింపజేసుకుంటూ తనదైన కొత్త బాణిలో...

సర్వపాపాని వేంప్రాహుః, కటస్తద్దాహ ఉచ్యతే.



అన్న పురాణోక్తిరీత్యా పాపాల్ని పటాపంచలు చేస్తూ భక్తులహృదయాల్లో సుస్థిరస్థానం ఏర్పరచుకొనిన మహనీయ మూర్తి ఆ వేంకటేశుడు.

ఈ శ్రీవేంకటేశ్వరునికి ఆంధ్రదేశం మొత్తంలో మూడువందల ఆలయాలున్నట్లు అంచనా. అందు కొన్ని ప్రాచీన ప్రసిద్ధి దేవాలయాలు. మరికొన్ని నవీన ఆలయాలు. ఇందు ప్రాచీన ఆలయాలన్నీ చోళరాజుల సమయంలోనో శ్రీకృష్ణదేవరాయల కాలంలోనో అభివృద్ధి చెందినవి.

ఇందు ముఖ్యంగా గుర్తించతగినవి చిత్తూరుజిల్లా లోని తిరుమల శ్రీ వేంకటేశ్వరుని ఆలయం, శ్రీనివాసమంగా పురం-నారాయణవనం-అప్పలాయగుంట; కడపజిల్లాలోని దేవునికడప, పశ్చిమగోదావరి జిల్లాలోని ద్వారకా తిరుమల, కృష్ణాజిల్లాలోని తిరుమలగిరి, అనంత పురంజిల్లాలోని తాడిపత్రి, నిజామాబాద్ జిల్లా లోని నిజామాబాద్ స్థానాలలోగల వేంకటేశ్వరుని ఆలయాలు అతి ప్రాచీనాలుగా గుర్తింపబడి నవి. వీటితోపాటు అతి ప్రాచీనంగా పేర్కొన బడింది **గుంటూరు జిల్లా బాపట్లమండలంలో అప్పికట్ల గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం.**

దేవాలయం - ఉనికి

అప్పికట్ల గ్రామానికి పడమటి దిక్కున ఆఖర్లో ప్రశాంత వాతావరణంలో తూర్పుముఖంగా ఈ వేంకటేశ్వరుని ఆలయం నిర్మింపబడింది. ఇందుగల ఆలయశిఖరం ద్రావిడ సంప్రదాయ పద్ధతిలో ద్వితల విమానంగా నిర్మింపబడింది. ఈ ఆలయ ప్రాకారంలో ముఖమండపం, అర్ధమండపం, గర్భాలయం ఉన్నవి. ఈ ఆలయం బయట యాగశాల, వాహనశాల ఉన్నాయి. ఆలయానికి ఎదురుగా ధ్వజస్తంభం ఒకటి

కష్టపడేవాడే ఫలితాన్ని పొందుతాడు

నిర్మించబడింది. అట్లే గర్భగుడిలో 2 అడుగుల 6 అంగుళాల ఎత్తు కలిగిన నల్లరాయితో చెక్కబడిన శ్రీవేంకటేశ్వరుని ఆకృతిగల విగ్రహం నిర్మించి ప్రతిష్ఠింపబడింది. ఈ స్వామికి ముందుభాగంలో ఉత్సవవిగ్రహాలు వామభాగాన చక్రత్తాళ్వారు చలప్రతిష్ఠతో స్థాపింపబడినవి. ముఖమండపానికి తూర్పున ధ్వజస్తంభానికి ముందుగ శ్రీవేంకటేశ్వరస్వామికి ఎదురుగా శ్రీఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించటానికిగాను ఒక మండపం నిర్మింపబడింది.

ఆలయచరిత్ర

ఆలయము యొక్క చరిత్రను తెలుపు గుర్తు ఏది కనబడుట లేదు. కానీ దీని యొక్క నిర్మాణపు తీరుతెన్నులనుబట్టి ఇది చాలా ప్రాచీన ఆలయంగా గుర్తింపవచ్చు. ఈ గ్రామంలోనే అగ్రభాగాన కాశీవిశ్వేశ్వర ఆలయం 12వ శతాబ్దంలో చోళరాజులచే ప్రతిష్ఠింపబడింది. ఆ కారణం చేత సమాన కట్టడ విధులను బట్టి ఈ వేంకటేశ్వరుని ఆలయంకూడా చోళరాజులే ప్రతిష్ఠించి ఉండవచ్చునని గ్రామపెద్దల కథనం.


ఆ తరువాత ఇది ఎన్నో మార్పుచేర్పులకు గురి అవటం చేత దీని స్వరూపం కొంత మార్పు చెందింది. ఆ విధంగా మార్పు చెందటానికి కారణం ఈ ఆలయం కొంతకాలం పోషకులయొక్క దానధర్మాలమీద ఆధారపడి ఉండటమే.

ఆ తరువాత బ్రిటిషువారు 1927లో దేవాదాయ శాఖను ఏర్పరిచి ఈ ఆలయాన్ని స్వాధీనంచేసుకోవటంచేత ఆనాటినుండి నేటివరకు ఆలయచరిత్ర స్పష్టంగా తెలుస్తుంది. అప్పటినుండే నిత్యపూజా నైవేద్యాదులన్నీ తూ.చ. తప్పకుండా జరుగుతున్నవని కూడా చెప్పవచ్చు.

ఈ ఆలయానికి ఎవరు దానం చేశారో స్పష్టంగా తెలియదు కానీ నేటికి 32 ఎకరాల 94 సెంట్ల మాగాణి భూమి మాత్రం ఉన్నది. అందు అర్చకులకు వంశపారంపర్యపు హక్కు క్రిందగానీ నిత్యనైవేద్యాదుల ఆచరణక్రింద గానీ 24 ఎకరాలు మాత్రం లభించినవి. ఆలయపాలన పరిరక్షణకుగాను 8.94 ఎకరాల భూమి దేవాదాయశాఖ వారి ఆధీనంలో ఉంది.

నేటి వ్యవవస్థ

దేవాదాయ ధర్మాదాయశాఖవారి ఆధీనంలోకి వచ్చినప్పటినుండి ఈ ఆలయంలో ఎన్నోమార్పులు జరిగినవి. అంగరంగ వైభవంగా ఉత్సవాలు చేయటానికిగాను ఫాల్గుణ పూర్ణిమకు త్రయాహ్నికంగా కల్యాణోత్సవం (బ్రహ్మోత్సవం) చేయు ఏర్పాటు జరిగింది.



వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం నిత్యపూజలు, విశేషపూజలు, నైమిత్తిక పూజలు జరుగుచున్నాయి. విజయదశమి దినమున సాయంకాలం పారువేట ఉత్సవం, వైకుంఠ ఏకాదశి తిథిన ముక్కోటి ఉత్సవము, ఫాల్గుణ శుద్ధ చతుర్దశి పూర్ణిమదినము లందు కల్యాణోత్సవ సంబంధ గ్రామోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కల్యాణోత్సవం మాత్రం ఫాల్గుణ శుద్ధ చతుర్దశీ దినమున రాత్రి రెండు నుండి నాలుగు గంటల మధ్య వైభవంగా జరుగుతుంది.

జలచరాధీశుని వైభవం

- డా॥ అద్దంకి శ్రీనివాస్,
98488 81838



శ్రీ మహావిష్ణువు లోకకల్యాణం కోసం అనేక అవతారాలను ధరించాడు. ఈ అవతారవిభూతిని విభవం అంటారు. ఈ విభవంలో దశావతారాలు ప్రముఖమైనవి. వాటిలో వేదాలను రక్షించడం కోసం 'మత్స్యావతారం' ధరించాడు స్వామి.

స్వామి ధరించిన ఒక్కొక్క అవతారానికి ఒక్కొక్క ప్రత్యేకత, ప్రయోజనం ఉన్నాయి. ముఖ్యంగా దశావతారాలలో మానవపరిణామక్రమం కనిపిస్తుంది. ప్రాణికోటి మొదట జలచరంగా ప్రారంభమయ్యిందనడానికి దశావతారాలలో మత్స్యావతారం మొదట ఉండడమే హేతువు. ఈ అవతారంలో పరమాత్మ నిర్వహించిన రెండు కార్యాలు ఉన్నాయి. వాటిలో ఒకటి ప్రళయ కాలంలో జీవరాసులను నావలో జలనిధిని దాటించడం. రెండువేదాలను పరిరక్షించడం.

చాక్షుస మన్వంతరం ముగిసిన తరువాత వైవస్వత మన్వంతరం ఆరంభమయ్యేకాలంలో జరిగింది ఈ మత్స్యావతారం. వైవస్వతుడు ఈ సృష్టికి మనువు కాబోతున్నాడు. వివస్వతుడు అంటే సూర్యుడు. వివస్వతుడి పుత్రుడు కాబట్టి ఇతడి పేరు వైవస్వతుడు అయ్యింది. ఇతడికే సత్యవ్రతుడు, శ్రాద్ధదేవుడు అనే పేర్లు కూడా ఉన్నాయి.

ఈ సత్యవ్రతుడు విష్ణుభక్తుడు. అతడు ఒకరోజు 'కృతమాలా'నదిలో తర్పణాలు వదులుతున్నాడు. అప్పుడు అతడి చేతికి ఒక చిన్న చేప పిల్ల తగిలింది. అది తనను కాపాడమని వేడుకొంది. రాజు ఆశ్చర్యపోయాడు. దానిని ఇంటికి తీసుకు వచ్చి కమండలంలో ఉంచాడు. మరుసటి రోజుకి అది పెరిగింది. ఆ కమండలం పట్టలేదు. దాని ఆకారం పెరిగిపోవడంతో దాన్ని తీసుకువెళ్ళి ఒక కుండలో వేశాడు.

పనిచేసేవాడికి దేనికి కరువు ఉండదు

ఇంకా దాని ఆకారం అలాగే పెరగడం మొదలుపెట్టింది. ఈసారి దాన్ని బావిలో వేశాడు. చేప ఇంకా పెరిగింది. ఈసారి దాన్ని నదిలో వేశాడు. నదికూడా పట్టనంతగా చేప పెరిగింది. ఇక చివరిగా దాన్ని తీసుకువెళ్ళి సముద్రంలో విడిచి వచ్చాడు. అప్పుడు అతడికి అది మామూలు చేపకాదని అర్థమయ్యింది. శ్రీ మహావిష్ణువు అవతారమని గ్రహించాడు. వెంటనే సాష్టాంగనమస్కారం చేశాడు.

అప్పుడు శ్రీహరి ప్రత్యక్షమై "రాజా ప్రళయకాలం ఆసన్నమయ్యింది. అప్పుడు సకల ప్రపంచమూ జలమయమౌతుంది. నా మహిమ వల్ల ఆ ప్రళయసాగరంలో ఒక నావ వస్తుంది. ఆ నావలో నిన్నూ, తపోమూర్తులైన సప్తర్షులను, ఓషధులను, తిరిగి సృష్టికోసం అవసరమైన వస్తుసంచయాన్నీ భద్రపరిచి నా శృంగంతో ఆ నావను లాగి ప్రళయసాగరాన్ని దాటిస్తాను" అని చెప్పాడు. సత్యవ్రతుడు శ్రీమన్నారాయణుడు చెప్పినట్టే చేసి ప్రళయం నుంచి బయటపడ్డాడు. అప్పుడు ఆ శ్రీమన్నారాయణుడిని సత్యవ్రతుడు ఇలా ప్రస్తుతించాడు.

చెలివై చుట్టమవై మనస్థితుడవై చిన్మూర్తివై ఆత్మవై
వలనై కోర్కెల పంటవై విభుడవై వర్తిల్లు నిన్నొల్లకే
పలువెంటన్ బడి లోకమక్కట
వృథా బద్ధాశమై పోయెడున్
నిలువన్నేర్చునె హేమరాశి గనియున్
నిర్భాగ్యుడంభశ్శయ్యాపహా!

(పోతన భాగవతం)

దానికి సంతోషించిన శ్రీమత్స్యావతార మూర్తి అతడికి సాంఖ్యయోగ క్రియ, పురాణ సంహిత ఉపదేశించాడు. ఆ సత్యవ్రతుడే ప్రస్తుతం నడుస్తున్న "వైవస్వత మన్వంతరానికి" అధిపతి.

సృష్టి కార్యంలో అలసిన బ్రహ్మ ఆ కల్పాంతంలో నిద్రపోయాడు. ఇదే అదనుగా చూసుకొని సోమకాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మ దగ్గరనుండి వేదాలను అపహరించి సముద్రంలో దాక్కున్నాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు మత్స్యరూపంలో వెళ్ళి ఆ రాక్షసుడిని చంపి, వేదాలను తిరిగి తెచ్చి బ్రహ్మకు ఇచ్చాడు. ఇలా విష్ణుమూర్తి నూతన సృష్టికీ, వేదపరిరక్షణకూ మత్స్యావతారంగా అవతరించాడు.

స్వామీ, నువ్వు చేపరూపం ధరించి సముద్రాన్ని నీ నిష్ఠీవనం ద్వారా పెంపొందింపజేశావు. బ్రహ్మచేత స్తుతి పొందావు. సూర్యపుత్రుడైన ఆ మనువు ఓషధులతో కూడిన నావను కొమ్ముకు కట్టుకొని ఒడ్డుకు చేర్చిన దయామయుడివి అని ఆ జలచరాధీశుణ్ణి స్తుతించడం ద్వారా ఈ సంసారసాగరాన్ని సులభంగా దాటవచ్చు.

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT

SAPTHAGIRI

(MONTHLY)
FORM IV
See Rule 8

1. Place of Publication : TIRUPATI
2. Periodicity of its Publication : Monthly
3. Honorary Editor : **Dr. D.Sambasiva Rao, I.A.S.,** Executive Officer, T.T.D.
4. Printer's Name : **Smt. M.Gowthami, M.B.A.,**
